జనరాజకీయం కోసం... వెల: 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 15 పక్షపత్రిక ఆగస్టు1-15, 2010



## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## మద్య నియంత్రణ చైతన్య యాత్ర

### దూబగుంట రోశమ్మ స్ఫూర్తిగా

# మద్య నియంత్రణ చైతన్య యాత్ర


నెల్లూరు జిల్లా


ప్రకాశం జిల్లా


గుంటూరు జిల్లా




కృష్ణా జిల్లా


చిత్తూరు జిల్లా


కడప జిల్లా


అనంతపురం జిల్లా


కర్నూలు జిల్లా



కష్టతరమైన పనిని చేసే వ్యక్తి ,
అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే
వ్యక్తి ఎన్నటికీ ఆత్మగౌరవాన్ని కోల్పోడు

– జార్జి బెర్నార్డ్ షా

## లోపలి పేజీల్లో...


ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ప్రతిష్టిద్దాం .........5

సోంపేట రక్త తర్పణం..................................6

నీటి వనరుల పంపిణీ.................................. 7

దత్తత గ్రామాల్లో జేపీ.................................... 8

పి.ఎస్.ఎల్వీ సి 15 విజయం హర్షణీయం.... 8

రాష్ట్రాన్ని రక్షించండి.................................... 9

మున్సిపల్ నాయకత్వ శిక్షణ........................10

అంకితభావం గల ఒక్కడు.......................... 11

వక్రమార్గం పడుతోన్న యువశక్తి..................14

మనమింతే..................................................16

జిల్లా వార్తలు................................................17


# స్వార్థశక్తుల వల్లే ప్రభుత్వం దివాళా

**సంపాదకీయం**

ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఆదాయాన్ని వదులుకోవటానికి కొత్త మార్గాలను వెతుకుతూ, ఉన్న కొన్ని వనరుల్నీ అర్థరహితంగా ఖర్చు చేస్తూ, రెండు రకాలుగా కూడా కొద్దిమంది ఎంపిక చేసుకున్న వ్యక్తుల్ని కోట్లకు పడగలెత్తేలా చేయటం తీవ్ర దిగ్భ్రాంతికరం.

గత ఆర్థికసంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వంతు వాటా రూ. 400కోట్లు ఇవ్వకుండా సర్వశిక్షా అభియాన్‌కు వచ్చే భారీస్థాయి కేంద్రనిధుల్ని మురిగిపోయేలా చేసింది.

దోపిడీ కోసం షెడ్యూల్డ్ ప్రాంతంలోని 55000ల హెక్టార్ల ఖనిజ సంపన్న భూమిని ప్రభుత్వం నిస్సిగ్గుగా స్వార్థశక్తుల అందుబాటులోకి తేబోతోంది. ప్రభుత్వ పథకం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) గనుల తవ్వకాన్ని చేపడుతుందిగానీ లాభం 16శాతం మించకుండానే ఖనిజాలను అమ్ముతుంది. ఓపక్క ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు గనుల లీజుల్ని అప్పగిస్తూ, కేవలం రాయల్టీ మినహాయించి వారి లాభాల్లో కించిత్తు వాటా కూడా లేకుండా వారు ఇష్టమెచ్చినట్టు అమ్ముకునే అడ్డూఅదుపూలేని స్వేచ్ఛనిచ్చింది. మరోవక్క, తన కొనుగోలుదారులుగా ఎంచుకున్నవారి నుంచి ఏపీఎండీసీకి వచ్చే ఆదాయపరిమితిని పరిమితం చేయటం ద్వారా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థను నాశనం చేస్తోంది.

ఒక మట్టిపెళ్లను తొలగించకుండానే, ఒక ఎకరం భూమికి నీరు ఇవ్వకుండానే ఒక సాగునీటి ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ. 1000కోట్లు కట్టబెట్టింది. నిర్మాణానికి రూ. 38,500కోట్ల అంచనా వ్యయం, నిర్వహణకు 3750 మెగావాట్ల విద్యుత్, ఎకరాకు నీరు అందించేందుకు పెట్టుబడి వ్యయం రూ. 3లక్షలు, పునరావృత నిర్వహణ, నిర్వహణ వ్యయం రూ. 40,000 అయ్యే ఆ ప్రాజెక్టుకు డిజైన్లు సిద్ధం చేయటం వగైరాలకు అనే సాకుతో ఆ ప్రజాధనాన్ని వెదజల్లింది.

అసంబద్ధమైన ఆ ప్రాజెక్టు మీద ఖర్చుచేసిన ఆ రూ. 1000కోట్లతో దాదాపు 5లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంటు చేయటమో లేక 10 లక్షలమంది యువతకు ఉద్యోగ, జీవనోపాధి సంపాదించుకునే ఏర్పాటు చేయటమో చేయగలిగి ఉండేది.

"ప్రభుత్వం దివాళా తీయలేదు. స్వార్థశక్తులు దివాళా తీయిస్తున్నాయి. అధికార కేంద్రాలకు దగ్గరగా ఉన్న కొంతమంది కోసం మాత్రం అత్యుత్సాహంతో, ఉదారంగా నిధులను విడుదల చేస్తుంటే, అవసరమైన పథకాలకు నిధుల కొరత రావటంలో ఆశ్చర్యపోవాల్సిందేముంది".

**ప్రేమ బాధలను సహిస్తుందే కాని, ఎన్నడూ ప్రతీకారాన్ని తలపెట్టదు** – గాంధీజీ

## లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

*ఆగస్టు 1-15, 2010 సంపుటి - 1 సంచిక - 15*

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# స్పందన

వాస్తవ సామాజిక పరిస్థితులను తెలియజేస్తూ చక్కటి సామాజిక వాతావరణమునకు 'దిశా నిర్దేశం' చేస్తున్న 'లోక్‌సత్తా టైమ్స్' పత్రికకు బహుమతిగా రూ॥ 1,116/- డ్రాఫ్ట్ పంపుచున్నాను స్వీకరించి నాకు ఆనందమును కలిగించగలరు.

అతి సామాన్య కుటుంబంలో జన్మించి, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన, సర్ మోక్షగుండు విశ్వేశ్వరయ్యగారిని ఒకమారు " మీ ఉన్నతికి కారణం – ఆధారం ఏమిటి?" అని ప్రశ్నించినపుడు " నేను చదివిన పుస్తకములే – నా ఉన్నతికి కారణం" అన్నారట. అలాంటి పుస్తకములలో సమాజాభివృద్ధికి ఆధారమయిన రాజకీయ విషయముల విషయంలో 'ఓ చక్కటి పత్రిక' అని నా భావం, సంతృప్తి.

జాతి పునరుత్తేజానికై తనవంతు కృషిని అందిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్ గార్కి ఋణపడి వుంటాను.

సదా మీ అభిమాని
**బి. శ్రీ కృష్ణమూర్తి, తణుకు**

**మీరు చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు – సంపాదకులు**

**మీరూ రాయండి :** *లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.*

**తన పూర్వీకుల ఘనతమీద బతికే వారిని మృత వీరుల జాబితాలో చేర్చవచ్చు** – లాసన్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.


### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజి 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు


### మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

### లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ప్రతిష్ఠిద్దాం... 2039 నాటికి భారత్‌ను అగ్రరాజ్య స్థాయికి చేరుద్దాం

## 63వ స్వాతంత్ర్య దినోత్సవాన జయప్రకాష్ నారాయణ్ పిలుపు

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. అయితే స్వాతంత్ర్యదినోత్సవ వేళ సంబరాలు మాత్రమే కాదు, నిర్మాణాత్మక సమీక్ష, ఆచరణాత్మక ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆనాడు తెల్లదొరల మీద పోరాడి విముక్తిని సాధించాం, ఈరోజు మన వ్యవస్థలో పాతుకుపోయిన సాంప్రదాయ రాజకీయ వ్యవస్థ మీద పోరాడి విముక్తిని సాధించాలి.

ఈవేళ మనం ఎదుర్కొంటున్న సమస్యలనే భావితరాలు కూడా ఎదుర్కోకూడదు. ప్రస్తుతమున్న సమస్యలను మన తరంలోనే పరిష్కరించి ముమ్ముందు తరాలవారికి మెరుగైన భారత్‌ను అందించాలి. 2039 నాటికి భారత్‌ను అగ్రరాజ్యస్థాయిలో నిలపాలంటే ఆ బాధ్యతను మనం స్వీకరించక తప్పదు. అందుకోసం స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించి జనం చేతికి అధికారం ఇవ్వటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, అవకాశాలు కల్పించి వివక్ష లేకుండా ఎదిగే సమాజాన్ని నిర్మించటం, అవినీతి నిర్మూలన, దామాషా తరహా ఎన్నికల వ్యవస్థతో అందరికీ ప్రాతినిధ్యం కల్పించటం, చట్టబద్ధ పాలనను అమలుచేయటం ఈవేళ మన ముందున్న ప్రధాన కర్తవ్యాలు. వీటితో భారత్ ఉజ్వల భవితకు మనం పటిష్ట పునాది వేయాలి. మేధస్సు, నైతికత ఉన్న దేశానిదే అగ్రరాజ్య స్థాయి.

**ఈ 63ఏళ్లలో చెప్పుకోదగిన విజయాల్నే సాధించాం. రెండోప్రపంచ యుద్ధం తర్వాత వలసపాలనలో ఇంత స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకున్న దేశం మరొకటి లేదు.**

ఈ 63ఏళ్లలో చెప్పుకోదగిన విజయాల్నే సాధించాం. రెండోప్రపంచ యుద్ధం తర్వాత వలసపాలనలో ఇంత స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకున్న దేశం మరొకటి లేదు. ఆర్థికవ్యవస్థ గణనీయంగా వృద్ధి చెందింది. సంపన్నుల సంఖ్య పెరిగింది... కానీ లోతుగా చూస్తే, ఎన్నో వెలితిలు కనిపిస్తాయి... స్వేచ్ఛ ఉందిగానీ, స్వపరిపాలన లేదు. ఓటు హక్కు ఉందిగానీ, వారసత్వ రాజకీయాల్ని అడ్డుకోలేం. రాజ్యాంగం ఉందిగానీ, సార్వభౌమాధికారం లేదు. అందరికీ ఒకే చట్టం అంటారుగానీ, ఉన్నవారికో న్యాయం లేనివారికో న్యాయం. ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా హింసాత్మక ఘటనలకు పాల్పడాల్సిందే. ఈనాటికీ 70శాతంమంది కుల,మత, లింగ వివక్షతల వల్ల ఉన్నత అవకాశాలను కోల్పోక తప్పటం లేదు. బాధ్యతలు, బాధలు ప్రజలవి, అధికారాలు, ఆడంబరాలు పాలకులవి... పూటకో మాట, ప్రాంతానికో విధానం, కులం, మతం, వర్గంతో పబ్బం గడుపుకుంటూ నివారించదగ్గ ఈ దారుణ పరిస్థితులకు కారణమైన సాంప్రదాయ రాజకీయ పార్టీల (సా.రా పార్టీల) పతనం ఇప్పటికే ప్రారంభమైంది. అయితే ఆ పతనాన్ని వేగవంతం చేసి ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ప్రతిష్ఠించే బాధ్యత తీసుకోవటం ఈవేళ మనందరి ముందూ ఉన్న తక్షణ కర్తవ్యం.

బతుకు భయం లేకుండా ప్రతి వ్యక్తీ సామాజిక భద్రతతో, ఆత్మగౌరవంతో జీవించేందుకు, చట్టసమానత నిక్కచ్చిగా అమలయ్యేందుకు, మన పన్నుల సొమ్ము మనకే ఉపయోగపడేందుకు, ప్రభుత్వకార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటిముందు పాలన కంటి ముందు ప్రభుత్వం వచ్చేందుకు, నేరపరిశోధన నిష్పాక్షికంగా జరిగేందుకు, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందేందుకు, అవినీతిని అంత మొందించేందుకు ఈరోజు మనమంతా స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో పోరాడాలి.

అయితే అప్పటిలా ఈనాడు మనం బానిసల్లా పోరాడాల్సిన పన్లేదు. సార్వభౌముల్లా మనలోని చెడును, వ్యవస్థలోని లోపాల్ని సవరించుకునేందుకు పోరాడాలి. ఈ స్వాతంత్ర్య లక్ష్యం సాధించటం కోసం మరో 60ఏళ్లు ఆగాల్సిన పన్లేదు. ఇప్పుడు అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, జనమాధ్యమాలు అందుబాటులో ఉన్నాయి. ఆలోచనాపరులంతా నిజాయతీగా వ్యవస్థలో మార్పు కోసం ముందుకు రావటమే తరువాయి. చెడ్డవాని దుర్మార్గంకన్నా మంచివాని మౌనం విషాదకరం. ఈరోజు దేశాన్ని ఆవరించిన విషాదకర పరిస్థితి నుంచి విముక్తం చేయటానికి అందరూ ప్రతిన పూనాలి. రాజకీయాలకు దూరంగా ఉన్నవారంతా, దేశం కోసం రాజకీయాల్లోకి రావాలి. వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ఏ బిడ్డకంటా కన్నీరు ఒలకని సామాజిక వ్యవస్థను నిర్మించాలి. ముఖ్యంగా దేశజనాభాలో 70శాతం ఉన్న యువత నాయకత్వ పగ్గాలు చేపట్టేందుకు ముందుకు రావాలని లోక్‌సత్తా పిలుపునిస్తోంది.

## నివారించదగిన

# సోంపేట రక్త తర్పణం

- సోంపేట థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు అంశాలపై వాస్తవాలను తెలుసుకునేందుకు లోక్‌సత్తా కమిటీ
- భూసేకరణ చట్టాన్ని సవరించి స్వయం ప్రతిపత్తి గల అథారిటీని ఏర్పాటు చేయండి

శ్రీకాకుళం జిల్లా సోంపేట వద్ద థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలో కొందరు ప్రాణాలు కోల్పోవటం, రక్తం చిందటం పట్ల లోక్‌సత్తా పార్టీ తీవ్ర దిగ్భ్రాంతిని, బాధను వ్యక్తం చేసింది. మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది.

ఈ అంశాల్ని లోతుగా పరిశీలించి వాస్తవాలను తెలుసుకునేందుకు నిపుణులు, రిటైర్డ్ ఉద్యోగులతో ఒక కమిటీని వేస్తున్నట్టు లోక్‌సత్తా పార్టీ ప్రకటించింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలోని కమిటీలో కొత్తకోట పోలినాయుడు, ప్రొ॥ డి. విష్ణుమూర్తి, పున్నాన కోటేశ్వరరావు (రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్), కోన మోహనరావు (న్యాయవాది), తమ్మినేని అన్నం నాయుడు (న్యాయవాది) సభ్యులుగా ఉంటారు.



ప్రభుత్వం ఉద్రిక్తతల్ని నివారించే చర్యలు తీసుకోకుండా పరిస్థితి అదుపుతప్పే దాకా తీసుకురావటం విచారకరం. ఏ అభివృద్ధి ప్రాజెక్టయినా పరస్పర ప్రయోజనాల ఘర్షణలకు దారితీస్తుంది. బాధ్యతతో స్పందించే ప్రభుత్వం అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ సామరస్యాన్ని నెలకొల్పుతుంది. పాలనావ్యవస్థ పూర్తిగా విశ్వసనీయత కోల్పోయిందని స్పష్టమవుతోంది. సున్నితమైన అంశాల్లో బలప్రయోగానికి దిగటం ఓ అలవాటుగా మారిపోయింది.

ప్రాజెక్టులు ఏర్పాటు చేయాల్సిన స్థలాన్ని, పారిశ్రామిక, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఎంత మేర భూములు అవసరమో నిర్ణయించటానికి ఒక విశ్వసనీయ, నిష్పాక్షిక, స్వయంప్రతిపత్తిగల వ్యవస్థ ఉండాలి. పరిహారం, పునరావాసం నిర్ణయించటానికి కూడా ఆ స్వయంప్రతిపత్తిగల అథారిటీకి అధికారం ఉండాలి. 'కనిష్ట సంఖ్య ప్రజల స్థానచలనంతో కనిష్ట స్థాయి భూమిని సేకరించటం' ప్రాతిపదికగా ఉండాలి. భూమిని పోగొట్టుకున్నవారికి డబ్బు, అభివృద్ధి చేసిన భూమిలో వాటా, ప్రాజెక్టుల్లో ఉద్యోగాల గ్యారంటీ ఉండాలి. ప్రజలు నిజమైన వాటాదారులుగా ఉన్నప్పుడు మాత్రమే పారిశ్రామికాభివృద్ధికి మద్దతివ్వటానికి ముందుకొస్తారు. ఇందుకోసం భూసేకరణ చట్టాన్ని సవరించాలి. స్వయంప్రతిపత్తిగల ఖ్వాజీ–జ్యుడీషియల్ వ్యవస్థను ఏర్పాటు చేసి నిష్పాక్షితను, అన్నివర్గాలకూ తగిన వాటానూ అందించాలి.

ప్రాజెక్టుల్ని ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే అంశం ఇతర ప్రాంతాల్లో కూడా సమస్యాత్మకంగా మారింది. ఉదాహరణకు, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో రైతులు రెండు పంటలు పండే తమ సాగుభూముల్ని జెన్‌కో విద్యుత్ ప్రాజెక్టులకు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. అటువంటి సమస్యలన్నిటినీ ఎప్పటికప్పుడు సవ్యంగా పరిష్కరించేందుకు వీలుగా ప్రాజెక్టు ఏర్పాటు స్థలాన్ని, ఎంత మేర భూములు అవసరం, పరిహారం, పునరావాసం నిర్ణయించటానికి స్వయంప్రతిపత్తిగల విశ్వసనీయ అథారిటీని ఏర్పాటు చేయటం తక్షణావసరం. "రాష్ట్ర ప్రభుత్వం సోంపేట విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికైనా స్థానిక ప్రజలను చర్చలకు పిలిచి సంతృప్తికర పరిష్కారాన్ని సాధించాలి".

# నీటి వనరుల పంపిణీ భారత ప్రభుత్వమే చేపట్టాలి

- బాబ్లీ పరిశీలనకు వెళ్లిన తెలుగుదేశం బృందం, లోక్‌సత్తా నేతల అరెస్టును ఖండించిన లోక్‌సత్తా
- బాబ్లీపై తక్షణం కేంద్రం జోక్యం చేసుకోవాలి
- బాబ్లీపై వాస్తవాలు మరాఠా ప్రజలకు కూడా తెలియాలి
- పార్టీలకతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడితెద్దాం

మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ తదితర ప్రాజెక్టులను సందర్శించి తమకున్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వెళ్లిన తెలుగుదేశం బృందాన్ని, లోక్‌సత్తా నేతల్ని మహారాష్ట్ర పోలీసులు నాటకీయంగా అరెస్టు చేయటాన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. జూలై 16న బాబ్లీ సందర్శనకు వెళ్లిన తెలుగుదేశం బృందంతో పాటు లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రాజారెడ్డి, పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు డా॥ ఎం. రాంరెడ్డి కూడా ఉన్నారు. వీరి అరెస్టులు గర్హనీయం. ప్రాజెక్టు విషయంలో ముందు ప్రజలకు నిజాలు తెలియచేయాలి. పూర్తి రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా కేవలం ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్లిన నేతల్ని అరెస్టు చేయటం అవి అక్రమప్రాజెక్టులన్న వాదనల్ని బలపరిచేవిగా ఉన్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా ఉంటుంది అని అనుమానాలుంటే కనీసం ఒక బృందాన్నయినా ప్రాజెక్టుల సందర్శనకు అనుమతించి ఉండాల్సింది. రాష్ట్రంలోకి అడుగుపెట్టనీయకుండా మరో రాష్ట్ర పౌరుల్ని అడ్డుకునే హక్కు ఎవరికీ ఉండదు. కేంద్ర ప్రభుత్వం చోద్యం చూడకుండా తక్షణం చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి. కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించటం వల్ల సమస్య మరింత జటిలంగా మారి ప్రజల మధ్య వైషమ్యాలు పెరుగుతాయి. విపరిణామాలు చోటుచేసుకుంటాయి.

"ఈ సమస్యకు జాతీయ దృక్పథంతో, రాజకీయ పరిష్కారమే సరైన మార్గం. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల మధ్య చిచ్చుపెట్టిన బాబ్లీ, ఇతర ప్రాజెక్టుల విషయంలో కేంద్రప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలి. అంతర్రాష్ట్ర జల వివాదాలన్నీ కేంద్రప్రభుత్వ పరిధిలోనే ఉండేవిధంగా ప్రధానమంత్రి చొరవ తీసుకుని దిగువ రాష్ట్రాల ప్రయోజనాల్ని కూడా పరిరక్షించాలి".

మహారాష్ట్రలో శాంతిభద్రతల సమస్య సృష్టిస్తారు కాబట్టే అరెస్టు చేశామని మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చెబుతున్న వాదన పచ్చి అబద్ధం, వేరేరాష్ట్రం నుంచి వచ్చిన 100మందిలోపు ప్రజాప్రతినిధులు, నేతలు విధ్వంసాలకు దిగుతారని చెప్పటం పూర్తిగా మభ్యపెట్టే ప్రచారం అర్థరహితమైన ఆరోపణలతో అరెస్టులు చేయటమేకాక తిరిగి రెచ్చగొట్టే రీతిలో మాట్లాడుతూ లబ్ధి పొందేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నించటం గర్హనీయం. ఒకే రాజ్యాంగపరిధిలో, ఒకే ప్రజల క్షేమం కోసం మనందరం రాజకీయం చేస్తున్నామన్న కనీస స్పృహతో మరాఠా ప్రభుత్వం వ్యవహరించాలి. బాబ్లీ తదితర అనుమానాస్పద ప్రాజెక్టులపై వాస్తవాల్ని కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రజలకే కాదు, మహారాష్ట్ర ప్రజలకు కూడా తెలియచేయాల్సిన బాధ్యత ఆ రాష్ట్ర సర్కారు మీద ఉంది.

ఈ పోరాటంలో లోక్‌సత్తా పూర్తిగా తన సహకారాన్ని అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పార్టీలూ కలిసికట్టుగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాల్సి ఉంది. రాష్ట్రాల మధ్య జలవివాదాలు దేశసమగ్రతకు ముప్పు తేకుండా కేంద్రం వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలి. "రాష్ట్రాల మధ్య నీటివనరుల పంపిణీని పూర్తిగా భారత ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలి. రాజకీయ ఏకాభిప్రాయాన్ని సాధించి జలవివాదాల్ని పరిష్కరించాల్సిన బాధ్యతను కేంద్రప్రభుత్వమే చేపట్టేలా ఆ అంశాన్ని రాజ్యాంగం ఏడో షెడ్యూల్ మొదటి జాబితాలో చేర్చాలి".

సరిహద్దుకు రెండు పక్కలా సంకుచిత భావోద్వేగాల్ని రెచ్చగొట్టకుండా బాబ్లీ, ఇతర ప్రాజెక్టులపై వివాదాలకు సంబంధించి ఓ రాజకీయ పరిష్కారానికి అన్ని పార్టీలూ కలిసికట్టుగా కృషి చేయాలి.

రాష్ట్ర ప్రథమ పౌరుడిగా రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, ప్రధానితో మాట్లాడాలని కోరుతూ జేపీ కేంద్రజోక్యం అవసరాన్ని వివరించారు. ప్రధానితో మాట్లాడేందుకు గవర్నర్ సమ్మతించారు.

బాబ్లీని జాతీయస్థాయి అంశంగా దేశ, రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకురావడానికి ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం చేసిన కృషిని లోక్‌సత్తా అభినందిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి తన అధ్యక్షతన అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి వద్దకు తీసుకువెళ్ళడానికి ముందుకొచ్చారు. సుప్రీం కోర్టులో కేసుకూడా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పార్టీలకతీతంగా ముందుకు రావాలి. ఆందోళనలు పరిష్కారానికి తొలిమెట్టు మాత్రమే. పరిష్కారాలు మాత్రమే శాశ్వతం ప్రయోజనకరం.

బాబ్లీ ఆంధ్రప్రదేశ్ ప్రజల చట్టబద్ధమైన నీటి హక్కులకు సంబంధించిన విషయం. ముఖ్యమంత్రి మరోసారి చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని పిలిచి ప్రధానితో చర్చలు జరపాలి. కోర్టు వెలుపల రాజకీయ పరిష్కారాన్ని కనుక్కోవాలని లోక్‌సత్తా కోరుతోంది. చర్చల ద్వారా పరిష్కారం సాధ్యం కానిపక్షంలో న్యాయస్థానాల్లో మన వాదనల్ని బలంగా వినిపించేందుకు రాజకీయ పార్టీలన్నీ సమీక్షించుకుని ముందుకు కదలాలి. అన్నీ పార్టీలూ పరస్పర మాటల యుద్ధాల్ని ఆపి ఒక్క తాటిమీదికి రావాలి. ఒకరిపై ఒకరు దూషణలకు దిగి రాష్ట్రాలమధ్య, ప్రజల మధ్య చిచ్చుకు కారణం కారాదు. దీనివల్ల సమస్య మరింత జటిలమవుతుందే తప్ప పరిష్కారం కాదు. బాబ్లీని తెలుగు ప్రజల ఆత్మగౌరవ సమస్యగా చూపించడంవల్ల భాషాపరమైన భేదాలు మొదలయ్యే అవకాశం వుంది.

టీడీపీ నేతలు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై శివసేన అధినేత బాల్ థాకరే చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం. సరిహద్దు దాటడమే తీవ్రమైన నేరంగా బాల్‌థాకరే ప్రకటించడం, మన రాష్ట్ర నేతల్ని అవమానపర్చాల్సిందిగా వ్యాఖ్యానించడం తీవ్రంగా గర్హించాల్సిన అంశం. ఎలాంటి వివాదం లేని సాలూరా ప్రాజెక్టు పై శివసేన కార్యకర్తల ముట్టడి ప్రయత్నాల్ని ఆక్షేపణీయం.

ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలు రేకెత్తించడానికి దీన్ని ఆజ్యంగా వాడుకోరాదు. ఇది ప్రభుత్వం, ప్రతిపక్షాలమధ్య వివాదం కాదు. ప్రజల అవసరాలు, హక్కులకు సంబంధించిందని పార్టీలు గుర్తించాలి. ఇది శాంతిభద్రతల సమస్యగా పరిణమించకుండా జాగ్రత్తపడాలి. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా నిర్మాణాత్మక పరిష్కారానికి ముందుకు కదలాలి.

# వరద బాధిత దత్తత గ్రామాల్లో

**జయప్రకాష్ నారాయణ్ పరిశీలన**

అక్టోబర్ 2009లో వచ్చిన వరద ప్రాంతాల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకున్న గ్రామాల్లో శాశ్వత నిర్మాణాల ప్రారంభ, పరిశీలనకు లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈనెల 19, 20 తేదీల్లో ఆ జిల్లాల్లో పర్యటించారు.

జూన్ 19న జేపీ మధ్యాహ్నం 3గంటల నుంచి పార్టీ కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలంలో దత్తత తీసుకున్న వరద బాధిత గ్రామం దక్షిణ చిరువోలు లంకలో చేపట్టిన ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ కార్యక్రమం పనుల్ని పర్యవేక్షించారు. సాయంత్రం గం॥ 5-30కు తిరిగి విజయవాడలోని కండ్రిగలో పార్టీ కార్యాలయ ప్రారంభం, అనంతరం జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు.

జూలై 20న గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం ఓలేరు గ్రామపంచాయతీలోని వెంకట్రాజునగర్‌లో లోక్‌సత్తా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి గ్రామస్తులకు అంకితం చేసారు. సాయంత్రం 5గం॥ల నుంచి 7గం॥ల వరకూ గుంటూరు నగరంలో కార్యకర్తల సమావేశంలో జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు.

లోక్‌సత్తా మహబూబ్‌నగర్ జిల్లా ఐజ మండలంలో దత్తత తీసుకున్న వరద బాధిత గ్రామం కేశవరంలో పాఠశాల భవనం గదుల్ని, కర్నూలు జిల్లాలో దత్తత తీసుకున్న పూలతోట పంచాయతీలో రివర్స్ ఆస్మోసిస్ మంచినీటి ప్లాంట్‌ను గతంలోనే ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# పీఎస్ఎల్వీ సీ-15 విజయం హర్షణీయం

- **స్టడ్‌శాట్ రూపకర్త విద్యార్థులకు జేపీ ప్రత్యేక ప్రశంస**

పీఎస్ఎల్వీ సీ-15 ప్రయోగం విజయవంతం కావటం హర్షణీయం ఈ వాహకనౌక ద్వారా కక్ష్యలోకి ప్రవేశించిన కార్టోశాట్ -2బి ఉపగ్రహం వల్ల పంటల పరిశీలనతో పాటు గ్రామప్రాంతాల్లో వనరుల అంచనా, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి ప్రయోజనాల్ని సాధించుకుంటూ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసుకోవచ్చు.

శాస్త్ర సాంకేతికరంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయస్థాయిలో సత్తాను చాటుతున్న భారత్... ముమ్ముందు ఈ రంగంలో సాహసోపేత విధానాల్ని అమలుచేయాలి. దేశాభివృద్ధికి మరింత దోహదం చేయాలి. సరైన ప్రణాళిక, నిధుల కేటాయింపులో సమతుల్యత, నిజాయితీ, అమలులో అంకితభావం ఉంటే శాస్త్ర సాంకేతికరంగాల్లో అద్భుతాలు సాధించగలమని మన శాస్త్రవేత్తలు నిరూపిస్తున్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు అహర్నిశలూ కృషిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. మరోవైపు, స్టడ్‌శాట్ ఉపగ్రహాన్ని రూపొందించి, నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని ఇంజినీరింగ్ విద్యార్థుల కృషి ప్రశంసనీయం.

మద్యం విధానాన్ని పునస్సమీక్షించి

# రాష్ట్రాన్ని రక్షించండి

◆ "సర్కారు మేలుకోకపోతే తిరగబడాలి. ఎక్కడికక్కడ కమిటీలతో మద్యాన్ని ప్రజలు అడ్డుకోవాలి

రోజురోజుకూ అనేకమంది మహిళల్ని చిన్నవయసులో వైధవ్యానికి గురిచేస్తూ, పిల్లల్ని అనాథలుగా మారుస్తూ, అనారోగ్యాన్ని, పేదరికాన్ని శాశ్వతం చేస్తున్న మద్యం విధానాన్ని స్వాతంత్ర్య సమరయోధుల తరానికి చెందిన నేతగా ముఖ్యమంత్రి రోశయ్య వెంటనే పునస్సమీక్షించాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, సామాజిక సంక్షేమానికి రూ.100,000 కోట్ల బడ్జెట్‌ను అమలుచేయటానికి మద్యం ఆదాయం పెంచుకోవటమే మార్గమని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నవి కుంటిసాకులు మాత్రమే. రాష్ట్రంలో మద్యం వల్ల కలుగుతున్న భయంకర నష్టాల్ని మరోమారు సాక్ష్యాధారాలతో లోక్‌సత్తా పార్టీ మద్యనియంత్రణ యాత్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. రోశయ్య ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మద్యంపై విధానాన్ని మార్చుకునే దిశగా యోచన ప్రారంభించాలి.

లోక్‌సత్తా పార్టీ 16 జిల్లాల్లో చేపట్టిన మద్యనియంత్రణ చైతన్యయాత్ర ముగిసిన సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో యాత్ర ఫోటో ఎగ్జిబిషన్‌ను జయప్రకాష్ నారాయణ్ ఆవిష్కరించారు. యాత్రలో పాల్గొన్న యువసత్తా, మహిళాసత్తా, లోక్‌సత్తా రాష్ట్రనేతలు, వలంటీర్లు, కళాబృందం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో మద్యం మహమ్మారి జడలుపరుచుకుని లక్షలాది పేద కుటుంబాల రక్తం పీల్చటానికి ఎక్సైజ్ అధికారులను తప్పు పట్టలేము మద్యాన్ని ప్రధాన ఆదాయమార్గం చేసుకున్న ప్రభుత్వం, ఆస్తుల్ని పెంచుకోవటానికి మద్యాన్నే వ్యాపారమార్గంగా చేసుకున్న సాంప్రదాయ పార్టీల (సా.రా పార్టీలు) నేతలే ఈ దారుణ పరిస్థితికి ప్రధాన కారణం. "ప్రజల్ని మత్తులో ముంచి పేదల్ని శాశ్వత పేదలుగా కొనసాగిస్తున్నారు. ఇక వీరి అభివృద్ధి నమూనా ఏమిటి? పేదల్ని ఏం చేద్దామనుకుంటున్నారు?" పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా పేదరికం ఎందుకు పెరుగుతోందో అర్థం చేసుకుంటే మద్యంపై సాంప్రదాయ రాజకీయం వ్యూహమేమిటో అర్థమవుతుంది.

### ఆదాయం కోసం అవినీతిని నియంత్రించండి .. పథకాల్ని హేతుబద్ధీకరించండి

మద్యం ద్వారా వచ్చిన పాపపు సొమ్ముతో సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన దుస్థితి అక్కర్లేదు. భయంకరంగా విస్తరించిన అవినీతిని కట్టడిచేయటం ద్వారా, విచ్చలవిడిగా ఉన్న పథకాలను హేతుబద్ధీకరించటం ద్వారా ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఆరోగ్యవంతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడపవచ్చు. ఏ పథకాన్ని ఏరీతిగా హేతుబద్ధీకరించాలో కావాలంటే లోక్‌సత్తా సవివరంగా అందిస్తుంది.

దేశచరిత్రలోనే అత్యధికంగా తాగుతున్నవారున్న, మద్యం ద్వారా ఆదాయాన్ని ఆర్జిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను దిగజార్చారు. దేశంలోనే రికార్డుస్థాయిలో ఒక గ్రామీణ ప్రాంతంలోని మద్యం దుకాణం వేలం పాటలో రూ.5.22 కోట్లు పలకటం, ఆ దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తికి సన్మానం చేయటం సిగ్గుచేటు. టీ దుకాణాల్లా మద్యం బెల్టుషాపులు వ్యాపించాయి. దీనివల్ల ప్రధానంగా పల్లెల్లో సుహృద్భావ, సామరస్య వాతావరణం క్రమంగా అదృశ్యమవుతూ విషపూరిత సంస్కృతి నెలకొంటోంది. ఈ మద్యం విధానం మన వేళ్లతో మన కళ్లనే పొడుచుకునేలా ఉంది.

సర్కారు మేలుకోకపోతే, మద్యం ప్రవాహం రాష్ట్రాన్ని బీభత్సంగా, దారుణంగా మార్చి అరాచకం సృష్టించేలోపే ప్రజలు మేలుకొని సర్కారీ మద్యం విధానంపై తిరగబడాలి. "యువత, మహిళలు, స్వచ్ఛందసంస్థలు జిల్లాల్లో, మండలాల్లో, గ్రామాల్లో మద్యనియంత్రణ కమిటీలుగా ఏర్పడి చట్టవిరుద్ధ బెల్టుషాపులను, లైసెన్సుషాపుల సిట్టింగ్ రూంలను నియంత్రించాలి. మద్య నియంత్రణతో పేదరిక నిర్మూలన, ఆత్మగౌరవ జీవితానికి నాంది పలకాలి. గ్రామాల్లో మద్యాన్ని నియంత్రించాక, గ్రామాభివృద్ధికి ప్రణాళికల్ని రూపొందించుకుని వాటి కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలి. పాఠశాల విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం తదితర మౌలికాంశాల మీద పోరాడాలి. మద్య నియంత్రణ, గ్రామాభివృద్ధి సాధనే లక్ష్యంగా కదలాలి. జనం చేతికి అధికారం రావటానికి మద్యంతో పోరాటం మొదలవ్వాలి. అందుకు కావలసిన సాహిత్యాన్ని, శిక్షణను, ఇతర తోడ్పాటును లోక్‌సత్తా అందిస్తుంది. ఎంతమంది యువత, మహిళలు ముందుకొస్తే అంతమందికీ లోక్‌సత్తా తన సాయం ఇస్తుంది.

**మా గ్రామంలో మద్యం దుకాణం వద్దని మా పంచాయతీ, గ్రామసభ, మండల పరిషత్ ఏకగ్రీవ తీర్మానం చేసినా, 1200 మహిళలు లైసెన్సులు ఇవ్వొద్దని అధికారులకు మొమోరాండాలు ఇచ్చినా, నేను నిరాహారదీక్ష చేసినా ఇప్పటి వరకూ ఫలితం లేకపోయింది. అక్కడ మద్యందుకాణం తొలగింపునకు లిఖిత పూర్వక హామీనిచ్చినా అధికారులు కాలయాపన చేస్తున్నారు.**

**పి. సూర్యచంద్ర,**
బూరుగుపూడి గ్రామం సర్పంచ్
కిర్లంపూడి మండలం, తూర్పుగోదావరి జిల్లా

# ముమ్మరంగా సాగుతున్న మున్సిపల్ నాయకత్వ శిక్షణ

**- బండారు రామ్మోహన్ రావు**

***మున్సిపల్ పట్టణాల్లో స్థానిక నాయకత్వాన్ని పటిష్టం చేసి వారికి స్థానిక ప్రభుత్వాలపై అవగాహన కల్పించి విషయ పరిజ్ఞానం ద్వారా సంఘటితమై ప్రజల సమస్యలపై ఉద్యమించడానికి స్థానిక నాయకత్వ శిక్షణను లోక్‌సత్తా చేపట్టింది. ఈ శిక్షణలో ప్రజల సమస్యలను గుర్తించడం, వాటికి తగిన పరిష్కారాన్ని వెతకడం, ఆ సమస్యపై ఒక మంచి నినాదంతో ప్రజల ముందుకు వెళ్ళి ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని చేపట్టి రేపటి ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించటానికి ఈ శిక్షణ ఉద్దేశించబడింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ శిక్షణా కార్యక్రమాలు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.***

రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పట్టణాల్లోని నాయకత్వాన్ని గుర్తించి తగిన శిక్షణ ఇవ్వడానికి ఉద్దేశించబడ్డ మున్సిపల్ నాయకత్వ శిక్షణ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతుంది. రాష్ట్రంలో జూన్ 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లోని సెంట్రల్ పార్కు హోటల్లో మాస్టర్ ట్రైనీస్ శిక్షణ జరిగింది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రాధాన్యత అంశాలు, లోక్‌సత్తా పార్టీ ఎజెండా, లోక్‌సత్తా పార్టీ తరపున పోటీ చేయడానికి అవసరమైన అభ్యర్థులను తయారు చేయడానికి ఈ ట్రైనింగ్ లో శిక్షణ ఇచ్చారు. 15 మంది మాస్టర్ ట్రైనీస్‌గా శిక్షణ పొంది రాష్ట్రంలోని వివిధ జోన్లలో శిక్షకులకు శిక్షణ ఇచ్చారు. మొదట తిరుపతి, ఒంగోలు పట్టణాల్లో జూన్ 26, 27, 28 తేదీల్లో శిక్షకులకు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. తిరుపతిలో జరిగిన శిక్షణకు రాయలసీమలోని చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుండి శిక్షణకు వచ్చారు. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనీస్‌గా బండారు రామ్మోహన్ రావు, వై. విజయేందర్ రెడ్డి, కార్తీక్ చంద్ర, చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయకుమార్, తిరుపతి మున్సిపల్ బాధ్యులు మాల్యాద్రినాయుడు హాజరయ్యారు. ఒంగొలు జోనల్ శిక్షణ శిబిరం లో కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుండి శిక్షణకు వచ్చారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనీస్‌గా కటారి శ్రీనివాసరావు, పాండురంగారావు హాజరయ్యారు.

హైదరాబాద్‌లోని కొత్తపేట ప్రజాస్వామ్య శిక్షణా కేంద్రంలో తెలంగాణ జిల్లాలలోని శిక్షకులకు జూన్ 28, 29, 30 తేదీల్లో శిక్షణ జరిగింది. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనీస్‌గా జి. రాజారెడ్డి, బండారు రామ్మోహన్‌రావు, కార్తీక్ చంద్ర హాజరయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన జోనల్ శిక్షణ కాకినాడలోని 'రాటికాడ్' శిక్షణాకేంద్రంలో జూలై 4, 5, 6 తేదీల్లో జరిగింది. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనీస్‌గా కార్తీక్‌చంద్ర, బండారు రామ్మోహన్ రావు హాజరయ్యారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ హాజరై స్ఫూర్తినిచ్చారు. ఈ శిక్షణలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి. రామారావు, యస్. మనోరమ, రాష్ట్ర సలహాసంఘ సభ్యులు డా॥ ఆలూరి విజయలక్ష్మి, విజయనగరం జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కె. పోలీనాయుడు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి కె. రామచంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు కరణం రామచంద్రరావు, రాజమండ్రి పార్లమెంటరీ అధ్యక్షులు చంద్రకళ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జి. జానకి రామరాజు తదితరులు హాజరయ్యారు.

జూలై 10, 11, 12 తేదీల్లో వరంగల్ లోని బాలవికాస శిక్షణ సంస్థలో జోనల్ శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీస్‌గా బండారు రామ్మోహన్ రావు, జి. రాజారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్చా కోదండ రామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కావ్య, కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి పి. వేణుమాధవ స్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షులు జట్టి రవి హాజరయ్యారు.

జోనల్ శిక్షణ తరువాత మున్సిపాలిటీల వారీగా పట్టణాల్లోని లోక్‌సత్తా కార్యవర్గాలు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి కలిగిన వారిని గుర్తించి రెండు రోజుల శిక్షణ ముమ్మరంగా జరుగుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రకాశం జిల్లా చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరులలో జూలై 24, 25 తేదీల్లో శిక్షణ జరిగింది. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనీస్‌గా మాధవ్, బండారు రామ్మోహన్ రావు, పాండురంగారావు, డి.వి.వి.యస్. వర్మ వ్యవహరించారు.

జూలై 27 నుండి ఆగస్టు 2 వరకు జరిగిన శిక్షణలో కర్నూలు జిల్లా కర్నూలు, నంద్యాల, కడప జిల్లా కడప, రాయచోటి, చిత్తూరు జిల్లా, మదనపల్లి, చిత్తూరు పట్టణాల్లో శిక్షణ జరిగింది. మాస్టర్ ట్రైనీస్‌గా వై. విజయేందర్ రెడ్డి, డి.వి.వి.యస్. వర్మ, కార్తీక్‌చంద్ర హాజరయ్యారు. గుంటూరు జిల్లా గుంటూరు, పొన్నూరు, నర్సరావు పేట పట్టణాల్లో జరిగిన శిక్షణకు మాస్టర్ ట్రైనీస్‌గా బండారు రామ్మోహన్‌రావు, పి. రవిమారుత్ హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం, సామర్లకోట లో జరిగిన శిక్షణ మాస్టర్ ట్రైనీస్‌గా వై.డి. రామారావు, డా॥ ఆలూరి విజయలక్ష్మి, కరణం వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు.

ఇప్పటికి 15 మున్సిపాలిటీలలో ఈ శిక్షణ జరిగింది. ఆగస్టు 31 కల్లా మరో 30 మున్సిపాలిటీలలో శిక్షణకు తగిన ఏర్పాట్లు జరిగాయి.

# అంకితభావం గల ఒకే ఒక్కడు మెజారిటీతో సమానం

## ( A Man with conviction is a Majority)

'కూకట్‌పల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా' అని అక్కడ శాసనసభ్యునిగా పోటీచేస్తున్నట్టు ప్రకటించినరోజున చెప్పిన మాటను లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ అక్షరాలా నెరవేర్చి చూపుతున్నారు. డా॥ జేపీ ఎమ్మెల్యేగా ఎన్నికై సంవత్సరం పూర్తయిన రోజున కూకట్‌పల్లిలోని అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తే, మోడల్ నియోజకవర్గానికి కావలసిన గట్టి పునాది కన్పిస్తుంది. డా॥ జేపీలాంటి వారు ఒక్కరైనా అసెంబ్లీలో ఉండాలి, అలాంటివారిని గెలిపించకపోతే మన ఆత్మగౌరవానికి అర్థమేలేదు అని ఓటు వేసినవారంతా ఇప్పుడు తమ ఆకాంక్షలు నెరవేరుతున్నాయని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో ఒక ఆశాకిరణాన్ని చట్టసభకు పంపటంలో తాము కూడా భాగస్వాములైనందుకు సగర్వంగా ఉందంటున్నారు. "పార్టీలకతీతంగా జేపీకి ఓటు వేశాం. ఆయన గెలిచాక మా వ్యక్తిగత వెంటనే ఎన్నో చేసేయాలని ఆశించాం. అయితే ఎవరినో మెప్పించేందుకుకాకుండా వార్డు స్థాయి నుంచి ఒక క్రమపద్ధతిలో ప్రజల భాగస్వామ్యంతో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తూ, ఇతర పార్టీల కార్పొరేటర్లను కూడా కలుపుకుంటూ, నిర్మాణాత్మకంగా కూకట్‌పల్లిని అభివృద్ధి చేస్తున్నారు. అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించి, జనం చేతిలో అధికారం పెడితేనే ఈ దేశంలో మార్పు సాధ్యమవుతుందని లోక్‌సత్తా చెబుతున్న మాటల్ని ఆయన రాజీలేకుండా ఆచరించి చూపుతున్నారు. ఆయన ఎక్కడా అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు, ప్రజల డబ్బుతో ఆడంబరాలకు పోలేదు. చాలా సీదాసాదాగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నారు. ఆవేశంతో తొలుత మేం కొంత అసంతృప్తికి గురైనా, ముందుచూపుతో ఒక లక్ష్యంతో డా॥ జేపీ చేస్తున్న పని అర్థమయ్యాక, మేం చాలా సంతృప్తిగా ఉన్నాం'' అని నియోజకవర్గంలోని ఒక పౌరుడు ఏడాది జేపీ హయాంను నిజాయతీగా విశ్లేషించారు.

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో అనేకసార్లు పర్యటించిన డా॥ జేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఒక స్పష్టమైన ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. నియోజకవర్గ సమస్యలను స్వల్పకాలంలో, కాస్త ఎక్కువ కాలంలో, ఐదేళ్లలో పరిష్కరించి పూర్తిచేయగలిగినవిగా వర్గీకరించుకుని నిర్దిష్టమైన లక్ష్యంతో కృషి చేస్తున్నారు.

అలాగే రాష్ట్రవ్యాప్త సమస్యలు, రాజ్యాంగపరమైన సమస్యలు, చట్టాలలోని లోపాలు, ప్రభుత్వ పథకాలలోని లోపాలు, ప్రభుత్వపరంగా జరుగుతున్న అక్రమాలకు స్పష్టమైన పరిష్కారాలు చూపుతూ డా॥ జేపీ శాసనసభలో అవిశ్రాంత పోరాటం చేస్తూ కొత్త రాజకీయం ముద్రను ప్రస్ఫుటంగా వేశారు. లోక్‌సత్తా తరుపున ఒకే ఎమ్మెల్యే ఉండటంతో సమయం తక్కువ కేటాయిస్తున్నా, ఆ కాస్త సమయంలోనే చాలా పదునైన రీతిలో, ప్రజాప్రయోజనాల్ని ముందుచూపుతో పరిరక్షించేరీతిలో హుందాగా తన భావాల్ని వ్యక్తీకరిస్తూ సభకు గౌరవాన్ని తెస్తున్నారు.

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో డా॥ జేపీ ఆధ్వర్యంలో జరిగిన వివిధ పనులు:**

2009 అసెంబ్లీ ఎన్నికల్లో డా॥ జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 01-06-2009న ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఆరోజు నుంచి నేటివరకూ కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం స్థిరమైన అభివృద్ధికి అనేక పనులు చేపట్టారు.

సులభంగా అర్థమయ్యేందుకు వీలుగా ఆ పనుల్ని 3 విభాగాలుగా చేయబడ్డాయి. అవి...

1) పరిష్కరించిన సమస్యలు
2) నిర్మాణదశలో ఉన్న వివిధ అభివృద్ధి పనులు
3) ప్రభుత్వ అనుమతి కొరకు ప్రతిపాదించినవి

### లోక్‌సత్తా పార్టీ సభ్యులకు విజ్ఞప్తి

★ లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని కార్యకలాపాలను సామాన్య ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళే ముఖ్య సాధనంగా వెలువడుతున్న 'లోక్‌సత్తా టైమ్స్' పక్ష పత్రికను ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్ళడంలో మీ పాత్ర ఎంతో ముఖ్యమైనది.


★ మీలో ప్రతీ ఒక్కరూ, ప్రతీనెలా కనీసం 5గురు చందాదారులను చేర్పించవలసినదిగా మనవి.

★ మీ సలహాలు, సహాయ సహకారాలు పత్రిక అభ్యున్నతికి, తద్వారా పార్టీ పురోగతికి తోడ్పడతాయని మరువవద్దు.

## పరిష్కరించిన సమస్యలు:

1. హైదరాబాద్‌లోని నీటికనెక్షన్లలో కూకట్‌పల్లిలో 10శాతం ఉన్నాయి. కానీ తాగునీటి సరఫరా మాత్రమే 5శాతమే ఉంది. అంతకుముందు వరకూ 8 ఎం.జి.డి (రోజుకు మిలియన్ గ్యాలన్లు)గా ఉన్న సరఫరాను 12 ఎం.జి.డికి పెంచటమైంది. త్వరలో దీన్ని 16 ఎం.జి.డికి పెంచే కృషి జరుగుతోంది.
2. మూసాపేట డివిజన్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మంజీరా నీటిని సరఫరా చేయటానికి 300 ఎం.ఎం, 400 ఎం.ఎం పైప్‌లైన్లను వేయటం జరిగింది (ఇది గత 5ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది). ఈ ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా 1.5లక్షల మందికి నీటి సరఫరా అందుతుంది.
3. నియోజకవర్గంలోని విభిన్న ప్రాంతాల నుంచి 98 మంచినీటి నమూనాలను సేకరించి వాటిలో క్లోరిన్, బ్యాక్టీరియా స్థాయిని పరీక్షించటం జరిగింది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన స్థాయిలో క్లోరిన్ ఏ ప్రాంతంలోని తాగునీటిలోనూ లేదు. 48 శాంపిళ్లలో బ్యాక్టీరియా కన్పించింది. తాగునీటిని సురక్షితంగా మార్చేందుకు అన్నిచర్యలూ చేపట్టవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వటం జరిగింది.
4. నీటిసరఫరా ప్రెషర్‌ను పెంచేందుకు సత్యనారాయణ స్వామి కాలనీ (కె.పి.హెచ్.బి డివిజన్), పర్వత్ నగర్ (మోతీనగర్), ఓల్డ్ బోయినపల్లిలో బూస్టర్ పంపుల్ని ఏర్పాటు చేశారు. (వీటి విలువ రూ.24 లక్షలు)
5. కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో 20 బోర్‌వెల్స్ (పవర్ బోర్లు మరియు పంపు బోర్లు) ఏర్పాటు చేశారు.
6. నియోజకవర్గంలో నీటికొరతను అధిగమించేందుకు సుమారు 35 కొత్త బోర్లను శాంక్షన్ చేయించారు... త్వరలో పని ప్రారంభమవుతుంది.
7. నియోజకవర్గంలోని దాదాపు 11 కాలనీలు/ మురికివాడల్లోని 2లక్షల మందికి ఉపయోగపడే భూగర్భ డ్రైనేజీ సిస్టమ్‌కు శ్రీకారం చుట్టారు. ఇది ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది.
8. కె.పి.హెచ్.బి డివిజన్లోని వసంతనగర్ నుంచి భగత్‌సింగ్ నగర్‌కు వర్షాకాలంలో వచ్చే వరదను నియంత్రించేందుకు వేసిన డ్రైనేజీ పైపులైన్‌ను పూర్తయింది. (దీని విలువ రూ.50లక్షలు)
9. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 6 ఎస్.టి.పిలు (మురికినీరు ట్రీట్‌మెంట్ ప్లాంట్లు)కు ప్రతిపాదించటమైనది.

   1 ఎస్‌టిపి పూర్తయింది,
   
   2వ ఎస్‌టిపి దాదాపు పూర్తికావొచ్చింది,
   
   2 ఎస్‌టిపిలకు కేటాయింపులు వచ్చాయి, పని త్వరలో ప్రారంభమవుతుంది. మరో రెండు ఎస్‌టిపిలకు కేటాయింపులు రావాల్సి ఉంది.



10. కూకట్‌పల్లిలోని మొత్తం 14 చెరువుల్ని సర్వే చేయటం జరిగింది. 3 చెరువులకు పూర్తి సామర్థ్య స్థాయి(ఎఫ్‌టిఎల్)లో గుర్తింపు రాళ్లు ఏర్పాటుచేశారు. వీటి ఆక్రమణల్ని అడ్డుకునేందుకు వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ 14 చెరువుల సరిహద్దుల పరిధిలో ఎటువంటి భూముల రిజిస్ట్రేషన్లూ చేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

11. నియోజకవర్గంలో ఉచిత కంటి, థైరాయిడ్, ఇతర ఆరోగ్య తనిఖీ శిబిరాలను అనేకమార్లు నిర్వహించారు.

12. బాలానగర్ ప్రాంతంలో ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఒక డాక్టర్ స్వచ్ఛందంగా రోగులను పరీక్షిస్తారు, చాలా సందర్భాల్లో ఉచితంగానే మందుల్ని అందిస్తారు.

**స్థలం: అభిషేక్ టవర్స్, హెచ్.ఎ.ఎల్ గేటు ఎదురుగా, విమల్ థియేటర్ సమీపంలో, బాలానగర్**

**సంప్రదించవలసినవారు: సుధాకర్ (సంస్థ)– 92463 36765**

13. కేవలం మున్సిపల్ విభాగం కిందే 69.69 కోట్ల రూపాయల విలువైన పనులు నియోజకవర్గంలో కేటాయించబడ్డాయి. ఇప్పటివరకూ 24.24కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఏ ప్రమాణాలపరంగా చూసినా ఇది చాలా పెద్ద కృషి.

14. డా॥ జేపీ బాధ్యతలు చేపట్టాక, మొత్తం నియోజకవర్గంలో 37 బి.టి రోడ్లు, 66 సి.సి రోడ్లుకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. 8 బి.టి రోడ్లు, 25 సి.సి రోడ్లపై పనులు కొనసాగుతున్నాయి. ఇవికాక, ఇంకా అనేక ఇతర రోడ్లకు సంబంధించిన పనులు ప్రతిపాదన దశలో ఉన్నాయి.

15. వసంతనగర్, దిల్‌షుక్‌నగర్ కాలనీ, సత్యనారాయణ స్వామి కాలనీల్లో పూర్తిస్థాయిలో వీథిదీపాల్ని ఏర్పాటు చేశారు. (వీటి మొత్తం విలువ రూ.14లక్షలు)

16. సఫ్దర్‌నగర్ (మోతీనగర్)లో భూగర్భ రైల్వే బ్రిడ్జిని నిర్మించారు.

17. నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్వహణపై మార్గదర్శకాల్ని రూపొందించారు. జారీకి సిద్ధంగా ఉన్నాయి.

18. కూకట్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న పనుల విషయంలో సంబంధిత జి.హెచ్.ఎం.సి, హెచ్.ఎం.డి.ఎ, హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్ అండ్ ఎస్.బి., రెవిన్యూ అధికారులను డా॥ జేపీ క్రమంతప్పకుండా కలుస్తూ పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తున్నారు.

**నిర్మాణదశలో ఉన్న వివిధ అభివృద్ధి పనులు:**

1. జె.ఎన్.టి.యు జంక్షన్ వద్ద ట్రాఫిక్ తాకిడిని తగ్గించటానికి హైటెక్ సిటీకి రెండు ప్రత్యామ్నాయ రోడ్లు మంజూరయ్యాయి. మొదటిరోడ్డు ఐ.డి.ఎల్ ఫ్యాక్టరీ నుంచి, రెండోది మూసాపేట నుంచి ఉంటాయి.

2. కూకట్‌పల్లివాసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కైతల్లాపూర్ వద్ద 220/132/33 కెవిఎ విద్యుత్ సబ్‌స్టేషన్ కొత్తగా శాంక్షన్ అయింది. ఇందుకోసం తగినంత భూమిని కేటాయించటం జరిగింది. (భూమి ఖరీదు కాకుండా ఆ ప్రాజెక్టుకు రూ.50కోట్లు వ్యయమవుతాయి). ఇది నిర్మాణానికి సిద్ధంగా ఉంది. 33/11 కెవిఎ సబ్‌స్టేషన్లు మరో 3 ప్రతిపాదన దశలో ఉన్నాయి.

3. ఓల్డ్ బోయిన్‌పల్లిలో కొత్త నీటి పైపులైన్లు మంజూరయ్యాయి. వీటి కోసం టెండర్లను పిలిచారు.

4. స్వర్ణధామ నగర్‌లో నీటిట్యాంకుకు ప్రతిపాదన మంజూరైంది. టెండర్లు ఆహ్వానించటమైంది.

5. ప్రశాంతనగర్ నుంచి రాజీవ్‌గాంధీనగర్ మార్గంలో ఓపెన్ నాలాపై బ్రిడ్జి మంజూరైంది (అంచనా వ్యయం రూ.49లక్షలు). దీనికి డా॥ జేపీ పునాదిరాయి వేశారు.

6. కె.పి.హెచ్.బి 6వ ఫేజ్‌లోని స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి.

**ప్రభుత్వ మంజూరు కొరకు ప్రతిపాదించబడినవి:**

1. మూసాపేట 'వై' జంక్షన్ నుంచి మియాపూర్ వరకు ఎన్‌హెచ్–9 మీద ఉన్న రోడ్డు విస్తరణ కొరకు ప్రతిపాదించబడినది. ఈ మార్గంలోని విపరీతమైన ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కుడి, ఎడమ వైపుల్లో "సర్వీసు రోడ్లు" ఏర్పాటుకు ప్రతిపాదన పంపారు.

2. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని 5 విభిన్న ప్రాంతాల్లో పాదచారుల సౌకర్యార్థం 5 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు ప్రతిపాదనలకు మంజూరు లభించింది. అవి...

   జెఎన్‌టియు జంక్షన్, కూకట్‌పల్లి బస్టాప్, మూసాపేట జంక్షన్, బాలానగర్ ప్రాంతం మరియు బేగంపేట

3. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రస్తుతం షిఫ్టుల్లో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి 2 ఎకరాల భూమికి ప్రతిపాదించటమైనది.

4. కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్‌ను వేరే చోటికి తరలించి ఆ ప్రాంతాన్ని కమ్యూనిటీ వినియోగం కోసం అభివృద్ధి చేసి ఆడిటోరియంను, షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించటం కోసం ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన పంపటమైనది.

5. రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో 3 సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.

"ప్రపంచీకరణ ప్రభావంతో

# వక్రమార్గం పడుతోన్న యువశక్తి

- కె.ఆర్.ప్రసన్న కుమార్

◆ ఐ.టి. భ్రమలో నవతరం-సామాజిక శాస్త్రాల అధ్యయనం పట్ల ఆసక్తి చూపని వైనం

"అన్నీ మన వేదాల్లోనే వున్నాయ్" నేది మన పండిత, పామరుల ఉవాచ. మనప్రాచీన శాస్త్రాలు, గ్రంథాలలో పలు విషయాల ప్రస్తావన, మరికొంత అధ్యయనం వుండవచ్చు. అయితే, "విజ్ఞాన సర్వస్వం" అన్పించుకునే వీలుందో లేదో కానీ "ఇప్పటి అత్యాధునిక ఆయుధాలు, క్షిపణులు వంటివి కూడా ఎప్పుడో మనవాళ్ళు తయారుచేసి ప్రయోగించారనీ", "మనవాళ్ళ ప్రాచీన పరిజ్ఞానం గొప్పద"ంటూ ఒకే పదానికి వివిధ అర్థాలనిచ్చే వీలున్న సంస్కృత శ్లోకాలలోని పదాలకు తమకు నచ్చిన భాష్యం చెప్పే "కుహనా పండితుల"కు యీ దేశంలో కొదవ లేదు. మరే ఇతర శాస్త్రాలూ వీరి తలకెక్కవు.

ఇదంతా ఒక తరహా వ్యక్తుల వైఖరి అయితే, ఆధునిక భారతంలో – అందునా, ఆంధ్రదేశంలో నేటి యువత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సంబంధింత కోర్సుల అధ్యయనం కోసం ''వేలం వెర్రి''గా వెంటపడుతోన్న తీరు విస్మయం కల్గిస్తోంది. అన్ని సమస్యలకీ ఐ.టి. నామస్మరణే తారక మంత్రంగా భావిస్తున్న యువతరం–మిగిలిన అన్ని రంగాలనూ గాలి కొదిలేసి, కేవలం 'డాలర్ల సంపాదన' కోసం వెంపర్లాడుతోంది. ఆకర్షణీయమైన జీతభత్యాలు, విలాసవంతమైన జీవనశైలి వీరిని యీ రంగం వైపు నడిపిస్తుండవచ్చు. అయితే, నిర్విరామ లక్ష్యాలు, నిరంతర వొత్తిళ్ళ మధ్య "త్రిశంకు స్వర్గా"ల అసలు స్వరూపం తెలిసేసరికి – ఆ 'మత్తు' నుండి బయట పడలేని "స్వచ్ఛంద బానిసత్వపు అశక్తత" వారిని అప్పటికే కబళించేసి వుంటోంది.

''గ్లోబలైజేషన్'', ''కార్పొరేటైజేషన్''ల ప్రభావానికి ఆధునిక ప్రపంచం అతలాకుతలమౌతోంది. తమ తమ దేశాలలో కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థలను పరిరక్షించుకోడం కోసం– సామ్రాజ్యవాద దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రలోభపెట్టి ఆ దేశాల ఆర్థిక సామాజిక, రాజకీయ రంగాలను వొత్తిళ్లకు గురిచేసి వారి సర్వ శక్తులనూ స్వప్రయోజనాలకు వాడుకుని– ''కార్పొరేటీకరణ'', ''ప్రపంచీకరణ'' మాయలో నేర్పుగా పడవేస్తున్నాయి.

ఒకప్పుడు, బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం గుమస్తా చదువులను ప్రోత్సహిస్తే, నేటి కార్పొరేట్ దొరలు ఐ.టి.సంబంధిత వ్యాపార విద్యలను నేర్పుతున్నారు. టెక్నాలజీ, డబ్బు సంపాదన తప్ప మరే "మానవతా విలువలూ" నేర్పని యిలాంటి చదువులు ఆధునిక భారతానికి ఎంతో భారమౌతున్నాయి. పైగా లక్షలు ధారబోసి సంపాదించే యిలాంటి డిగ్రీలు ఎంతమందికి అందుబాటులో వుంటున్నాయి? విదేశాలకు వెళ్ళే స్తోమత ఎంతమందికి ఉంది? ఎవరో కేవలం డబ్బునువాళ్ళ పిల్లలు, కొందరు మధ్యతరగతి వాళ్ళు 'కొనగలిగే' యీ చదువులు అత్యధిక శాతం జనాభా వున్న పేద, గ్రామీణ ప్రాంతాల వారికి ఎంతవరకు ప్రయోజనకరం?

ఐ.టి, కంప్యూటర్ విద్యలు "ఆధునిక ప్రపంచానికి ఆధారం" కావచ్చు! మనవాళ్లు అందులో నిష్ణాతులూ కావచ్చు! ఐతే, 'కంప్యూటర్' అనేది మానవుని కార్యసాధనను వేగవంతం చేయగల నైపుణ్యాన్ని మెరుగుపరచగల వొక సాధనం మాత్రమే! అదే సర్వస్వం కాదు. మానవుని ఆలోచన, వివేచనలను అధిగమించే కంప్యూటర్ యింకా పుట్టలేదు. కాబట్టి, ఒక రంగంలో విశేషమైన కృషి, అభివృద్ధి జరిగితే – అది ఆ ఫలితాల్ని ఉపయోగించి చేసే పనుల్లో నాణ్యతను, నైపుణ్యాన్ని మెరుగుపరుస్తుంది. దాని పరిధి అంతవరకే! మరి, కేవలం యీ ఒక్క రంగాన్ని ఆకాశానికెత్తుతూ, విశేష ప్రాచుర్యం కల్పించడంవల్ల మొత్తం సామాజిక అభివృద్ధి కుంటు పడడం లేదా?

భారతావనిది సరిగ్గా యిదే పరిస్థితి, ప్రభుత్వాల ఉదాసీనత, ప్రైవేటైజేషన్ ప్రభావాలవల్ల చాలా రంగాలలో అభివృద్ధి బలహీనంగా వుంది. వివిధ ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేసి చాలా కాలమైంది. ఏవో కొన్ని ఉపాధ్యాయ ఉద్యోగాలు తప్ప! ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు "పుట్టగొడుగు"ల్లా వెలిసాయి. ఎల్.కే.జి. చదువలకే వేలు, లక్షలు వసూలు చేసే కార్పొరేట్ విద్యా సంస్థల అసలు ప్రయోజనం "వ్యాపారం" కాక మరేమిటి? చిన్నతనం నుండే ''వ్యాపార విద్యలు'' నేర్చుకుంటున్న నేటితరం "మానవీయవిలువ"ల ప్రయోజనాలు ఎలా గ్రహించగలదు? అందుకే, యీ విద్యావిధానం మారాలి! విద్యార్థి స్వేచ్ఛగా తనకు నచ్చిన రంగాన్ని – కేవలం, ఉపాధి కోసం కాకుండా.... సామాజిక విలువల పరిరక్షణ కోసం – సేవాదృక్పథంతో ఎంచుకోగలిగే "అసలైన చదువు" కావాలి! కేవలం 'బ్రతుకు తెరువు' కోసం కాకుండా "విజ్ఞానానికి", "పరిపూర్ణ వ్యక్తిత్వానికి" దోహదపడే చదువులు కావాలి మనకు!

విద్యార్థులు "వేలం వెర్రి"గా, "గొర్రెదాటు మనస్తత్వం"తో కోర్సులు ఎంచుకోకుండా– తమ ఆసక్తి, ఆలోచనా విధానానికి సరిపడే కోర్సులపై దృష్టిపెడితే, మనదేశం అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చెందుతుంది. అయితే, ఉపాధి కల్పనా రంగాన్ని

పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న నేటి ప్రభుత్వాల తీరుతెన్నులే, విద్యార్థులు కొన్ని రంగాలను ఎంచుకోకపోవడానికి ప్రధాన కారణం. ఒకప్పుడు, ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులకు మంచి గిరాకీ వుండేది. డాక్టర్లు ఇంజనీర్లు ఒకప్పుడు రోల్ మెడల్స్, ఇప్పుడు, ఆస్థానాన్ని ఐ.టి.ప్రొఫెషనల్స్ ఆక్రమించారు. మరి మిగతా కోర్సుల మాటేమిటి? భౌతిక, రసాయన శాస్త్రాలు, వాటిని అధ్యయనం చేసే విద్యార్థులూ కరువయ్యారు.

అత్యంత కీలకమూ, మిగతా అన్ని రంగాలనూ నడిపించాల్సిన రాజకీయరంగం, ఇతర సామాజిక శాస్త్రాలు, చరిత్రలను చదివేవారు. "పనికిరానివారు"గా చలామణి అవుతున్నారు. ఒక మాజీ రాష్ట్ర ప్రభుత్వాధినేతకైతే, ఏకంగా సామాజిక శాస్త్రాలు, చరిత్ర వంటివి వొట్టి వ్యర్థమైనవిగా తోచి– వాటిని నిషేధించ పూనుకున్నారొకప్పుడు! తాత్విక, రాజకీయ రంగాలు అసలు ఎవరికి పట్టనివిగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో మన చదువుల ప్రస్థానం ఎటువైపు? వక్రమార్గం పడుతోన్న మన యువతరపు ఆలోచనా విధానాన్ని ఎలా మార్చాలి?

రోజు రోజుకి పెరిగిపోతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరు పైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి, అసహనం పెరిగి పోతున్నాయి. "రాజకీయ అస్థిరత్వాని"కి దారితీసే యీ పరిస్థితుల పట్ల నేటి రాజకీయ వర్గాలు ఆత్మాశ్రయ ధోరణితో, ప్రజలను మభ్యపెట్టే పలు రాజకీయ వాగ్దానాలతో వ్యవహరిస్తున్నాయి తప్ప – నిజాయితీతో, ప్రజా ప్రయోజన దిశగా తమ ఆలోచనలను మార్చుకోవడానికి కృషి చేయడం లేదు. అందుకే, యీ సమస్యలన్నింటికీ మూలమైన "పాలనారంగాన్ని" ప్రక్షాళన చేస్తే తప్ప యీ పరిస్థితుల్లో మార్పురాదు. అందుకోసం "జనం కోసం రాజకీయం" చేస్తే సత్తాగల ఒక బలమైన "రాజకీయ వేదిక" కావాలి. అందులో ప్రస్తుత జనాభాలో సగభాగంగా వున్న యువతరాన్ని భాగస్వాముల్ని చేసి – రాజకీయ శిక్షణ, సామాజిక చైతన్యం కల్పించగలిగే పరిస్థితి వుండాలి.

"రాజకీయ చైతన్యం" లేని పక్షంలో, ప్రజలిచ్చిన అధికారంతో ప్రజలు కట్టే పన్నులతో, ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రజా ప్రతినిధులు నిర్లజ్జగా, నింపాదిగా వారిపై అధికారం చెలాయిస్తూ, ప్రజాధనం భోంచేస్తూ బొజ్జలు పెంచుకుంటూనే వుంటారు. ఈ పరిస్థితుల్లో మార్పు కోసం "ధన రాజకీయాన్ని జన రాజకీయం" చేసే లక్ష్యంతో, యువతరం భాగ్యస్వామ్యంతో మహిళలు, దళిత, బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత నిస్తూ "ప్రజలే ప్రభువులు–పాలకులు సేవకులే"నని గుర్తుచేసే అసలైన "ప్రజల పార్టీ"గా ఆవిర్భవించింది 'లోక్‌సత్తా పార్టీ'.

వ్యక్తి వికాసానికి అత్యంత కీలకమైన విద్య, వైద్యం, ఉపాధి కల్పనా రంగాల పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తూ ఉచిత విద్య, అత్యంత తక్కువ ఖర్చుతో పూర్తిస్థాయి వైద్యం, చదివిన చదువుకి స్వార్థకత నిచ్చే ఉపాధికల్పన – ప్రధాన లక్ష్యాలుగా "లోక్‌సత్తా పార్టీ" పనిచేస్తోంది. కానీ, నేటి తరంలో చాలామందికి "క్లాసు పుస్తకాలు" తప్ప వేరే ఏ పుస్తకాలూ చదివే అలవాటు లేదు, సృజనాత్మకతను, శాస్త్రీయతనూ పెంపొందించే సాహిత్యం, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు చదివేవారు అతితక్కువ, అదీ గాక, ఇంగ్లీష్ మీడియం చదువుల, ఐ.టి. చదువుల ఇలాంటి విషయాల జోలికి పోవు. తెలుగు చదవడం, వ్రాయడం సరిగా రాని 'ఈతరం' తెలుగు వారెందరో!

తమ అభిమాన హీరో నటించిన చిత్రాల లిస్టు, అభిమాన క్రికెటర్ సాధించిన రికార్డులు నిద్రలో కూడా తడుముకోకుండా చెప్పగలిగే వీరిని "తమ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పెట్టే ఖర్చెంతో" చెప్పమంటే మాత్రం తెల్లముఖం వేస్తారు. రాజకీయాలు ఎవరో కొంతమంది వ్యక్తుల ప్రైవేటు వ్యవహారంగా భావించే చాలామంది – తాము ఏం కోల్పోతున్నామో తెలియని అమాయకత్వం, ఉదాసీన వైఖరితో వ్యవహరిస్తుంటారు.

చదవడం ద్వారా రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే వారిని రచనల ద్వారా ప్రభావితం చేయవచ్చు. ఇలాంటి రచనలను పండితులు, మేధావులు తెగ మెచ్చుకోనూ వచ్చు. కానీ, దీనిద్వారా వచ్చే ప్రయోజనం బహుస్వల్పం. ఎందుకంటే, అత్యధికులు చదువుకునీ నిరక్షరాస్యులుగా, కొంతమంది పుట్టుకతోనే నిరక్షరాస్యులుగా వున్న యీ దేశ ప్రజల ఆలోచనల్ని ప్రభావితం చేయడానికి గొప్ప రచనలో, గొప్ప పుస్తకాలో అంతగా దోహద పడక పోవచ్చు.

దృశ్య– శ్రవణ మాధ్యమాల ద్వారా లభించే సమాచారంపై బాగా ఆసక్తి వుండి, వాటి 'ఆస్వాదన'కు అలవాటు పడిన మనదేశ ప్రజలకు – అత్యంత రాజకీయ చతురత, గొప్ప వాగ్ధాటి, బలమైన వాణిని విన్పించగలిగే ప్రజాకర్షణ గల వ్యక్తులు చెప్పే మాటలు బాగా రుచిస్తాయి. బాగా ప్రభావిత పరుస్తాయి. అందుకే "లోక్‌సత్తా పార్టీ" అన్ని స్థాయిల్లోను మంచి 'వక్తల'ను ప్రోత్సహించవలసి వుంది. అలాగే, కళా, సాంస్కృతిక రంగాల ప్రభావం యీ దేశ ప్రజలపైన, ముఖ్యంగా ఆంధ్ర ప్రజలపైన అత్యధికం. అందుకే వివిధ జానపద కళారూపాలు, సాంస్కృతిక బృందాల ఏర్పాటుపైన కూడా పార్టీ మరింత దృష్టి పెట్టవలసిన అవసరం వుంది. చిన్న చిన్న డాక్యుమెంటరీలు, సినిమా, టెలివిజన్ రంగాలలో స్ఫూర్తిదాయక ప్రకటనలపై కూడా ఆలోచన చేయవలసి ఉంది.

వీటన్నింటి సాధనకూ ఒక నిర్మాణాత్మకమైన, బాధ్యతాయుతమైన కార్యనిర్వాహక వర్గం అవసరం. సమాజంలోని ఆలోచనాపరులు, మేధావులు, కవులు, కళాకారులు, కృషివలురందరూ భేషజానికి, మరే యిజానికీ పోకుండా తమ విలువైన సమయంలో కొంత "ప్రజా రాజకీయ సాధనకు" కేటాయించగలిగితే, అతి త్వరలోనే మరింత మెరుగైన సమాజాన్ని నిర్మించుకోగలం! ఆరోజు కోసం యీ క్షణం నుంచే మనమంతా 'కార్య సాధన' ప్రారంభిద్దాం! తొలిఅడుగు యిక్కడనుండే వేద్దాం! "లోక్‌సత్తా పార్టీ" వేదికగా "జన రాజకీయాన్ని" సాధిద్దాం!

# మనమింతే

- కొంగర గంగాధర రావు

బయ్యారం తవ్వి చూస్తే నేటి రాజకీయం అర్థం అవుతుంది. అక్షరాల పదమూడు లక్షల కోట్ల రూపాయల అవినీతి. సాక్షాత్తూ ఆర్థికరంగ దురంధరుడు ముఖ్యమంత్రి రోశయ్యకే కళ్ళు తిరిగాయంటే....

ఈ వేళ జగన్ ఎదురు తిరిగాడు కాబట్టి కేంద్రం ఆయన ఆర్థిక మూలాల మీద దెబ్బ కొట్టేందుకు బయ్యారాన్ని తవ్వి తోడుతోంది. ఇంకా ఓబుళాపురం, చీమకుర్తి వగైరా... లేనట్లయితే ఎన్ని లక్షల కోట్లు.... అంత ప్రజాధనం లూటీ అవుతోందన్న విషయం కూడా ఎవరికీ తెలిసేది కాదు. జగన్ తండ్రి అయిన రాజశేఖర్ రెడ్డి ఏలుబడిలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గప్‌చుప్‌గా ఆమోదించింది. ఆనాడు కేంద్రంలో వున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే. ఆనాడు అస్మదీయుడు కాబట్టి రాజశేఖర్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా చెల్లింది. జగన్ ఎదురు తిరగడం మన అదృష్టం.

ఇలాగే అందరు రాజకీయ నాయకులు ఒకరి తరువాత ఒకరు ఎదరు తిరిగితే బావుండు. అందరి జాతకాలు బయటపడి బోలెడంత ప్రజాధనం బయటికి వస్తుంది. దేశం సుభిక్షమవుతుంది.

ఎన్ని కోట్ల రూపాయలు..... ఒక్కో రాజకీయ నాయకుడు సాధారణమయిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలవటానికి కోట్లు ఖర్చుపెడుతుంటే ఒకోచోట అది 30 నుంచి 50 కోట్ల వరకూ చేరుతోంది. ఎందుకింత ఖర్చు చేస్తున్నారు అన్నదానికి బయ్యారం బొయ్యారాలు సమాధానం చెపుతాయి. ఒక్క గనుల రంగమే ఇలా వుంటే అన్ని ప్రభుత్వ రంగాలు కలిపితే? అమ్మో! రోశయ్యగారు గట్టిపిండం కాబట్టి కళ్ళు తిరిగాయి. మనకు గుండె ఆగిపోతుంది.

ఏ వ్యాపారంలో అయినా 10 శాతం లేదా 20 శాతం లాభం వుంటుంది. ఆ మధ్య రియల్ ఎస్టేట్ బూమ్‌లో 200 శాతం లాభం అన్నారు. కాని రూపాయి పెట్టుబడి పెట్టకుండా 13 లక్షల కోట్ల రూపాయల లాభం... అదీ ఒక్క కలంపోటుతో అంటే రాజకీయం ఎంత లాభమో అర్థమవుతుంది. పదవి వుంటే దేశాన్ని ఎలా దోచుకోవచ్చో అర్థం అవుతుంది. అధికారం కోసం ఎన్ని కోట్లయినా ఎందుకు ఖర్చు పెట్టాలో అర్థం అవుతుంది.

అమాయకులం. రోజూ రెండుపూటలా బిర్యానీ పెడితే ఎలక్షన్లలో గొడ్డుల్లా పనిచేస్తాం. రాత్రికింత మందుపోస్తే కైపెక్కి కుంభకర్ణుల్లా నిద్రపోతాం. తెల్లారితే రోడ్లెక్కి అన్న జిందాబాద్ అంటాం. అన్న గెలిస్తే అయిదేళ్లు కుక్కకు బొక్కలా మనరక్తం మనమే చవిచూస్తూ బ్రహ్మానందం పొందుతాం. అన్నను ఎవడైనా మాట అంటే వాడి కాళ్లు విరగగొడతాం. గొంతు నొక్కేస్తాం. అవతలి వాడు బలవంతుడయితే అన్న కోసం మన ప్రాణాలయినా సంతోషంగా అర్పిస్తాం. అన్న ఇంట్లో కుక్కకి మన విశ్వాసం చూస్తే అసూయ.

ఇక మధ్య తరగతి. భగత్‌సింగ్ గురించి కబుర్లు చెప్పుకుంటాం. చంద్రశేఖర్ ఆజాద్‌ను తలచుకొంటాం. రోడ్డు మధ్య గాంధీ బొమ్మ కనపడితే గౌరవంగా తప్పుకుంటాం. కొండకచో, సుభాష్ చంద్రబోస్‌ను చూసి గర్వంగా ఫీలవుతాం. అంబేద్కర్‌ను చూసి మహానుభావుడు అనుకుంటాం. ఎంత మందినైనా తలచుకొంటాం. కాని ఎలక్షన్ల రోజు సెలవుని ఎంజాయ్ చేస్తాం. పోలింగ్ బూత్‌కి వెళ్ళం. ఛీ రాజకీయాలనుకుంటాం. ఈ రాజకీయాలు మారవంటాం. మన చుట్టూ ఎవరైనా రాజకీయాల్లో చేరితే అవసరానికి గౌరవిస్తాం. మనసులో చీదరించుకుంటాం. మనింట్లో ఎవరైనా రాజకీయాల్లోకి వెళతానంటే కాళ్ళిరగకొడతాం.

ఇంక హైక్లాస్. వాట్ నాన్సెన్స్ యూఆర్ టాకింగ్ అంటాం. రాజకీయ నాయకులతో పనివుంటే నిర్మొహమాటంగా డబ్బిచ్చి పనిచేయించుకుంటాం. అవసరమయితే ఎలక్షన్లలో వారికోసం ఖర్చుపెడతాం. వాళ్లు గెలిస్తే వీలయినంత వాళ్ళ దోపిడీలో భాగస్వాములమవుతాం.

జయప్రకాష్ నారాయణ్ లాంటివారు రోడ్డున పడితే ఇంకో ఇరవై ముప్పై ఏళ్ళు ఆగమంటాం. ఆజాద్‌లను ఆదిలాబాద్ అడవుల్లో కాల్చివేస్తే భావాన్ని కూడా బయటకు రానివ్వం. హేమచంద్ర పాండే ఊపిరులాగినా అయ్యో పాపం అని ఊరుకుంటాం.

**మనమింతే** అగ్నిప్రళయం సంభవించి మరో శ్రీశ్రీ ఉద్భవించి, అస్తమించినా మనం మారం. సముద్రమంత ధీర గంభీరులం మనం.


## కావలెను

- ★ ప్రజాశ్రేయస్సే పరమావధిగా నెలకొల్పబడిన లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని, దైనందిన విషయాలపై లోక్‌సత్తా పార్టీ ప్రతిస్పందనలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే సాధనం 'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక.
- ★ ఈ పత్రికకు చందాదారులను చేర్పించేందుకు ఆసక్తిగల యువతీయువకులు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో కావలెను.
- ★ మరిన్ని వివరాలకై స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్నిగాని, రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్నిగాని సంప్రదించగలరు.

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## నెల్లూరు జిల్లా




### 'బెల్టు'పై లోక్‌సత్తా సమరం

- దూబగుంటలో మద్యం బాటిళ్ల ధ్వంసం
- కావలిలో ర్యాలీ, మద్యం దుకాణాల తనిఖీ

**వింజమూరు :** కావలిటౌన్ కలిగిరి మండలం జూలై 7న దూబగుంటలో లోక్‌సత్తా పార్టీ నాయకులు మద్యం బాటిళ్లను ధ్వంసం చేశారు. సారా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు దూబగుంట రోశమ్మ ఆధ్వర్యంలో వారు బెల్టుషాపులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి కె. శ్రీనివాసరావు, మహిళాసత్తా నాయకురాళ్లు మనోరమ, సరోజ తదితరులు మాట్లాడుతూ బెల్టుషాపులకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన కార్యక్రమాన్ని దూబగుంట నుంచి ప్రారంభించారు. ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక మద్యం దుకాణాల్లోని మద్యం బాటిళ్లను వారు వీధిలో పారేసి ధ్వంసం చేశారు.

### కావలిలో ర్యాలీ, తనిఖీలు

లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జూలై7న కావలి పట్టణంలో మద్య నియంత్రణ చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైన్‌షాపులలో తనిఖీలు చేపట్టి, అక్కడ మద్యం సేవిస్తున్న వారిని తరిమేశారు. షాపులో లూజువిక్రయాలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జెండావీధి వద్ద నుంచి ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో లోక్‌సత్తా కార్యకర్తలు ఆటపాటలతో మద్యవ్యతిరేక ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మద్యానికి ప్రజల ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టిందన్నారు. మహిళాసత్తా నాయకురాళ్లు మనోరమ, విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు మద్యం కారణంగా నిత్యం గృహహింసకు గురవుతున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతులై మద్యపానాన్ని వ్యతిరేకించాలన్నారు. అనంతరం వైన్‌షాపులో అదుపులోకి తీసుకున్న వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించేందుకు ప్రయత్నించగా, అతను పరారయ్యాడు. ఈ విషయమై లోక్‌సత్తా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దీనిపై లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మద్యం దుకాణానికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు చూపించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచినీరు దొరకకపోయినా ఊరూరా మద్యం, చీప్ లిక్కర్, నాటుసారా ఏరులై పారుతోందని చెప్పారు. మహమ్మారి పేద కుటుంబాల్లో చిచ్చు పెడుతోందన్నారు. అందుకే లోక్‌సత్తా ఆధ్వర్యంలో బెల్టుషాపులపై ఉద్యమాన్ని ప్రారంభించామని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ చైతన్యయాత్రలో లోక్‌సత్తా కళాకారుల డప్పు వాయిద్యం ఆటపాటలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు నర్రా శ్రీధర్, మహిళాసత్తా నేతలు మనోరమ, మహాలక్ష్మి, విజయలక్ష్మి, యువసత్తా శివాజీ, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



### మద్య నిషేధ ఉద్యమానికి సిద్ధం

**వింజమూరు :** తొలి మద్య నిషేధ ఉద్యమానికి నేతృత్వం వహించిన దూబగుంట రోశమ్మను కలిసి నేతలు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా చూస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదని ధ్వజమెత్తారు ఈ ఏడాది మద్యం వేలం ధరలను చూస్తుంటే అమ్మకాలు ఎంత విచ్చలవిడిగా జరుగుతున్నాయో అర్థమౌతుందన్నారు. దూబగుంట

రోశమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి తనకు ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా ఎవరు పోరాటం చేసినా తన మద్దతు పూర్తిగా ఉంటుందన్నారు. తదుపరి పార్టీ కార్యకర్తలు గ్రామంలోని మూడు మద్యం బెల్టుషాపులను తొలగించారు. అందులోని మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి గ్రామస్తులందరితో మద్యనిషేద ఉద్యమానికి బాసటగా నిలుస్తామని ఆ గ్రామ సర్పంచ్ సమక్షంలో ప్రమాణం చేయించారు.

### మద్యం దుకాణాన్ని మార్చాలి

**నెల్లూరు, గూడూరు రూరల్ :** జూలై 7న మాళవ్యానగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఆ దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలంటూ యువసత్తా, విద్యార్థి సత్తా ఏఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శన, ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.



### బెల్టు దుకాణాలపై సమరం

- **దూబగుంటలో లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఉద్యమం**
- **దుకాణాలపై దాడులు, సీసాల ధ్వంసం**

**తూర్పుదూబగుంట (కలిగిరి):** బెల్టుదుకాణాలపై జిల్లాలో ఉద్యమం ప్రారంభమైంది. కలిగిరి మండలం దూబగుంటలో లోక్‌సత్తా ఆధ్వర్యంలో దుకాణాలపై దాడులు నిర్వహించారు. సీసాలను ధ్వంసం చేశారు. తొలుత జూలై 7న లోక్‌సత్తా, మహిళాసత్తా, యువసత్తా నేతలంతా కలిసి తూర్పు దూబగుంటలోని సారా నిషేధ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన రోశమ్మ ఇంటికి వెళ్లారు. ఆమెకు ఉద్యమం వివరాలు తెలిపి ఉద్యమాన్ని నడిపేందుకు ముందుకు రావాలని కోరారు. తాను ఎప్పుడూ ఉద్యమానికి సహకరిస్తానని రోశమ్మ హామీ ఇచ్చి నేతలతో కలిసి ఉద్యమం చేపట్టింది. ముందుగా లోక్‌సత్తా నేతలు స్థానిక దేవాలయం వద్ద రోశమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మంచినీరు దొరకని ప్రాంతంలో కూడా మద్యం ఏరులై పారుతోందన్నారు. విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు లేని



ప్రాంతంలో బెల్టు దుకాణాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి మద్యం ఆదాయ మార్గం అయిందన్నారు. దీని కోసం ప్రజలను ప్రభుత్వమే మత్తులో ముంచుతోందన్నారు. మద్యనిషేదం జరిగేంత వరకు ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా వ్యర్థమన్నారు.

### కట్టుబాటుతోనే సాధ్యం - రోశమ్మ

నాడు మద్యపాన నిషేధ ఉద్యమం జరిపిన రోజుల్లో గ్రామంలో కట్టుబాటు ఉండేది. తద్వారా ఉద్యమం చేశాం. సారా నిషేధం అమలు చేయగలిగాం. అనంతరం గ్రామంలో కట్టుబాటుపోయింది. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు ప్రారంభమయ్యాయి. నా ప్రాణం పోయేంత వరకు మద్యపాన నిషేధ ఉద్యమాలకు సహకరిస్తా.

### ఉద్యమానికి సహకరిస్తాం - రమణారెడ్డి, సర్పంచి

నాడు ఉద్యమం జరిగిన రోజుల్లో నేనే సర్పంచిగా ఉన్నా, ఇపుడూ నేనే ఉన్నా, మద్యనిషేధ ఉద్యమాలకు సహకారం అందిస్తా. గ్రామస్థుల్లో కట్టుబాటు ఉంటే ఎక్కడైనా మద్యం అమ్మకాలు అరికట్టవచ్చు.

## ప్రకాశం జిల్లా

### గొలుసు అంగళ్లపై తిరుగుబాటు

**ఒంగోలు సంతపేట :** గొలుసు దుకాణాలు నిషేదించాలి. మద్యం దుకాణాల వద్ద అక్రమ సిట్టింగ్ విక్రయాలను వ్యతిరేకిస్తూ ప్రజా అరెస్టులకు లోక్‌సత్తా సిద్ధమైందని ప్రకటించారు. ర్యాలీని చేపట్టారు. జూలై 8న ఒంగోలు కర్నూలు రోడ్డులోని బైపాస్ జంక్షన్ వద్ద గల సాయి హనుమాన్, ఆర్టీసీ డిపో కూడలి గుడి ప్రక్కన గల సాయి హనుమాన్ మద్యం దుకాణాలపై దాడిచేశారు. నిబంధనలకు విరుద్ధంగా విడి విక్రయాలను, అనుమతిలేకుండానే సిట్టింగ్ పాయింట్లు పెట్టి విక్రయాలు చేపట్టడాన్ని నిలదీశారు. ప్రజాస్వామ్య హక్కులు కాలరాసేలా విక్రయాలు జరుగుతున్నా ప్రభుత్వం నిద్రపోతుందని తీవ్రంగా విమర్శించారు. అందుకే స్థానిక ప్రజల సహకారంతో పార్టీ ప్రజా అరెస్టులు చేపట్టిందని తెలిపారు. లూజువిక్రయ సీసాలను స్వాధీనం చేసుకని పోలీసుస్టేషన్‌కు అప్పగించనున్నట్లు ప్రకటించారు. డిపో సెంటర్‌లో గుడి ప్రక్కనే

మద్యం విక్రయించటం పై నినదిస్తూ సీసాలు స్వాధీనం చేసుకునే క్రమంలో దుకాణ యజమాని వాగ్వాదానికి దిగారు. అనుమతులు లేకుండా దుకాణంలో మద్యం సీసాలు తీసుకెళుతున్నారంటూ దుకాణ నిర్వాహకులు పెనుగులాటకు దిగారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటంతో పోలీసులు రంగప్రవేశం చేసి లోక్‌సత్తా పార్టీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ప్రజల జీవితాలను నాశనం చేసే మద్యం అక్రమ విక్రయాలను అడ్డుకుంటుంటే పోలీసులు అదుపులోకి తీసుకోవటాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. 47 మంది నేతలను ఒంగోలు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### అర్థంతరంగా ముగిసిన ర్యాలీ

పార్టీ నేతలను అదుపులోకి తీసుకోవటంతో కార్యకర్తలు అర్థంతరంగా ర్యాలీని నిలుపుదల చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్లారు. పోలీసుల తీరును ఖండించారు. కఠారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరుల హక్కులను అణిచివేసేలా పోలీసు చర్యలున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లు శివరమేష్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోరమ, రాష్ట్ర మహిళాసత్తా కార్యదర్శి మహాలక్ష్మి, ఎన్.రాధాదేవి, ఎ.విమలాదేవి, విజయకుమరి, సత్తా రాష్ట్ర అధ్యక్షులు దాసరి రత్నం, జిల్లా నేతలు జె.జానకిరాము, సిహెచ్.శివకుమార్, కృపావర్ధన్, మారుతీప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.



**లోక్‌సత్తా నేతల అరెస్టు**

◆ **అర్థంతరంగా ఆగిన మద్య నియంత్రణ చైతన్య యాత్ర**

**ఒంగోలు టూటౌన్ :** ర్యాలీలో మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్లేబోర్డులు పట్టుకుని కార్యకర్తలు ముందు భాగాన నడిచారు. రాష్ట్రంలో మంచినీళ్లు దొరకని గ్రామాలు ఉన్నాయని, మద్యం దొరకని గ్రామం లేదని, ఆంధ్రప్రదేశ్‌ను మద్యాంధ్ర ప్రదేశ్‌గా మారుస్తున్నారని నినాదాలు చేశారు. బెల్ట్ షాపులు వద్దు అంటూ నినాదాలు చేశారు. మహిళా సంఘాలు, పొదుపు సంఘాలు ఏకమై బెల్ట్‌షాపులను మూసివేయాలని పిలుపునిచ్చారు. కొంతమంది కార్యకర్తలు బెల్ట్ షాపుల వల్ల పేదలకుటుంబాలు నాశనమవుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని నినాదాలు చేశారు. వ్యాన్‌లో ఉన్న కళాకారులు మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ పాటలు పాడారు. ర్యాలీ బైపాస్ కూడలిలోకి వచ్చిన తరువాత అక్కడ ఉన్న బెల్ట్ షాపులోకి నాయకులు, కార్యకర్తలు వెళ్లి కొంతమంది తాగుతున్న సుమారు 25లూజ్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని లోక్‌సత్తా నాయకులు పోలీసులకు అప్పగించేందుకు అదుపులోకి తీసుకుని వ్యాన్ ఎక్కించారు.

### లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఐదు గ్రామాల్లో బెల్టుషాపుల పై దాడులు

**అద్దంకి రూరల్ :** మండలంలోని నాలుగు గ్రామాల్లో బల్లికురవ మండలంలోని ఒక గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం షాపులపై లోక్‌సత్తా పార్టీ నేతలు, ఆయా గ్రామాల మహిళలతో కలసి సంయుక్తంగా జూలై8న దాడులు నిర్వహించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నేతలు అద్దంకి వచ్చారు. అద్దంకి నుంచి శింగరకొండలోని చెరువు వద్ద ఉన్న బెల్లుషాపులో తనిఖీ నిర్వహించి సుమారు 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. షాపు నిర్వాహకురాలు కామేశ్వరమ్మను ప్రజా అరెస్టు చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా వెంపరాల, ఉప్పలపాడు గ్రామాల్లో బెల్టుషాపులను కూడా తనిఖీలు నిర్వహించగా ఆ బెల్టుషాపుల్లో వారికి మద్యం సీసాలు దొరకలేదు. అక్కడి నుంచి ఏలేశ్వరవారిపాలెం, బల్లికురవ మండలంలోని వెల మవారిపాలెం గ్రామాల్లోని బెల్టుషాపుల్లో సోదాలను నిర్వహించారు. ఏలేశ్వరవారిపాలెంలో మూడు బెల్టుషాపుల్లో, వెలమవారిపాలెంలో ఒక బెల్టుసాపులో దొరికిన కొన్ని మద్యం సీసాలను అక్కడ పగలకొట్టి 11 మద్యం సీసాలతో పాటు ఆయాషాపుల నిర్వాహకులను నలుగురిని స్థానిక సీఐవద్ద హాజరు పరిచారు. శింగరకొండ వద్ద ఉన్న బెల్టుషాపు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేశామని, ఆమెతో పాటు మిగిలిన నాలుగు షాపుల నిర్వాహకులను కూడా ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు పంపుతున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కఠారి శ్రీనివాసరావు, మహిళ సత్తా రాష్ట్ర కార్యదర్శి మహాలక్ష్మి, మహిళాసత్తా రాష్ట్ర నాయకులు మనోరమ, శారదాదేవి, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సభ్యురాలు ఎన్ రాధాదేవి, జిల్లా పార్టీ అధ్యక్షులు అల్లు శివరమేష్ రెడ్డి, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి నర్రా సాంబశివరావు, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి మంచినేని శ్రీనివాసులు, అద్దంకి యువసత్తా అధ్యక్షులు ఎవి సత్యనారాయణ, పరిటాల నారాయణ, దూళిపాళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

### మద్యం దుకాణాలపై లోక్‌సత్తా సమరం

**ఒంగోలు టౌన్ :** అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న మద్యం షాపులపై, బెల్టుషాపులపై లోక్‌సత్తా పార్టీ సమరభేరీ మ్రోగించింది. ఇందులో భాగంగా జూలై8న లోక్‌సత్తా మద్య వ్యతిరేక బృందం స్థానిక లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి కర్నూలు రోడ్డు, బైపాస్ జంక్షన్‌లో ఉన్న మద్యం షాపును పరిశీలించి అందులో బాటిల్స్‌లో కాకుండా విడిగా



మద్య విక్రయించడాన్ని తప్పుబట్టి ప్రజా అరెస్టు చేశారు. అనంతరం ర్యాలీగా ఆర్‌టిసి. బస్టాండ్ సమీపంలోని మద్యం షాపుకు వచ్చి ఆ షాపులో లూజు విక్రయాలను అడ్డుకొని లూజ్ బాటిళ్లను తీసుకొని అక్కడి సిబ్బందిని ప్రజా అరెస్టు చేస్తుండగా మద్యం షాపువారికి లోక్‌సత్తా పార్టీ నాయకులకు ఘర్షణ జరుగుతుండడంతో సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్.ఐ.శివరామకృష్ణారెడ్డి లోక్‌సత్తా పార్టీ నాయకులు 16 మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు తమను అక్రమంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని లూజు విక్రయాలు జరుపుతున్న షాపువారిని పట్టించుకోలేదని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ సి.ఐ. పోతురాజు లోక్‌సత్తా పార్టీ నాయకులతో చర్చించి ముందస్తు చర్యగా అదుపులోకి తీసుకున్నామని తెలియజేసి సొంత పూచి కత్తుపై వారిని విడుదలచేశారు.

### లోక్‌సత్తా ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడి

**అద్దంకి :** బెల్టుషాపుల నిర్వాహకులపై లోక్‌సత్తా ఆధ్వర్యంలో జూలై8న దాడులు నిర్వహించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. అద్దంకి మండలంలోని శింగరకొండ, వెంపరాల, ఉప్పలపాడు, ఏలేశ్వరవారిపాలెం, బల్లికురవ మండలం వెలమ వారిపాలెంలలో బెల్టుషాపులను లోక్‌సత్తా నాయకులు పరిశీలించారు. శింగరకొండ సమీపంలోని భవనాశికట్ట వద్ద ఉన్న మురగన్ హోటల్‌లో మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న ఓ మహిళను, ఏలేశ్వరవారిపాలెం వెలమవారిపాలెంలో ఒకరిని అదుపులోకి తీసుకొని అద్దంకిసీఐ రమేష్ బాబుకు అప్పగించారు.

# గుంటూరు జిల్లా

### 'ప్రజాస్వామ్యానికి మద్యం ముప్పు' - లోక్‌సత్తా

- 'మద్యం'పై లోక్‌సత్తా సమరభేరి

**గుంటూరు :** మద్యం అమ్మకాలపై లోక్‌సత్తా సమరభేరి మోగించింది. లోక్‌సత్తా నిర్వహించిన మద్యం నియంత్రణ చైతన్యయాత్ర జూలై9న నగరంలో సాగింది. తొలుత లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి కటారి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళాసత్తా



అధ్యక్షురాలు సరోజాదేవి నేతృత్వంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. శంకర్‌విలాస్ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్‌కు చేరుకొన్నారు. అనంతరం పార్టీ వాహనంపై ఉన్న కళాకారులు మద్యానికి వ్యతిరేకంగా పాటలు పాడారు. పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామానికి పది బెల్టుషాపులను ఏర్పాటు చేసి సామాన్య కుటుంబాలను చిందరవందర చేస్తున్న మద్యం వ్యాపారాన్ని ఉక్కుపాదంతో అంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా సత్తా అధ్యక్షురాలు సరోజాదేవి మాట్లాడుతూ బెల్టు షాపులను పూర్తిగా తొలగించేంత వరకు ఉద్యమిస్తామని చెప్పారు.

రాజకీయం, మద్యం పెనవేసుకున్నాయని, ఈ బంధం ప్రజాస్వామ్యానికే ముప్పుగా పరిణమించిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మద్యం దుకాణాల టెండర్లలో జిల్లానే ప్రథమస్థానంలో నిలిచిందని, అటువంటి జిల్లాలో బెల్టుషాపులను కొనసాగవ్వమని ఆయన హెచ్చరించారు. బెల్టుషాపులను నియంత్రించాలని కోరుతూ నెల్లూరు జిల్లా దూబగుంటలో పార్టీ ప్రారంభించిన మద్య నియంత్రణ చైతన్యయాత్రలో భాగంగా జూలై9న గుంటూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్కువ ధరలకు పోటీపడి మద్యం దుకాణాలు చేజిక్కించుకున్న పాటదారులు తమ సొమ్ములు రాబట్టుకోవడానికి బెల్టుషాపులపై దృష్టి కేంద్రీకరించారని, వీటికోసం వారు వేలంపాటలు నిర్వహిస్తున్నారన్నారు.

**వాగ్వాదం :** అనంతరం నాయకులు, కార్యకర్తలు కొరిటెపాడు మార్కెట్ సెంటర్‌లోని నూతనంగా ప్రారంభించిన విజయదుర్గా వైన్స్‌షాప్ వెనుక ఉన్న షెడ్డులోకి వెళ్ళి నినాదాలు చేశారు. దీంతో షాపు సిబ్బంది, నిర్వాహకులు,లోక్‌సత్తా నాయకులు మధ్య వాగ్వాదం జరిగింది. అరండల్‌పేట ఎస్‌ఐ దొప్పన బ్రహ్మయ్య, సిబ్బందితో పాటు సంఘటనా స్థలానికి చేరుకొని లోక్‌సత్తా నాయకులను, కార్యకర్తలను బయటకు



వెళ్ళాల్సిందిగా సూచించారు. ఎస్ఐ బ్రహ్మయ్య ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి, జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు లలితకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు తోటకూర శరత్‌బాబు, నగర కార్యదర్శి సాంబయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విజయదుర్గ వైన్స్‌పై దాడి

ర్యాలీ అనంతరం పార్టీ నాయకులు కొరిటెపాడు సెంటర్‌లోని విజయదుర్గ వైన్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా 'సిట్టింగ్' ఏర్పాటు చేశారంటూ అక్కడికి చేరుకున్నారు. కేవలం సీల్డ్ సీసాలే అమ్మాలని, లూజు విక్రయించకూడదని, పక్కనే బార్‌లా సిట్టింగ్ ఏర్పాటు చేశారంటూ షాపు యజమానిని నిలదీశారు. ఆయన్ని అక్కడికక్కడే సివిల్ అరెస్ట్‌కు ప్రయత్నించగా షాపు యజమాని నిరాకరించడంతో అతనిపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



## మద్య నియంత్రణ యాత్రలో ఉద్రిక్తత

**గుంటూరు, ఎన్నాదేవి (సత్తెనపల్లి) :** జూలై 9న సత్తెనపల్లి మండలంలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన మద్య నియంత్రణ చైతన్యయాత్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఎన్నాదేవి సమీపంలోని మూడు దాబా హోటల్‌లోకి లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు వెళ్లి మద్యం సీసాలను పట్టుకున్నారు. సుమారు 100కు పైగా సీసాలను పోలీసులకు అప్పగించాలని భావించారు. అయితే దుకాణదారులు లోక్‌సత్తా ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ఈ హడావుడితో ప్రస్తుతం హోటల్‌లో తినేవాళ్ళు సైతం పారిపోయారని, ఆ నగదు ఎవరిస్తారని దౌర్జన్యం చేశారు. దీంతో ఇరుపక్షాల నడుమ తోపులాటలు జరిగాయి. ఈ నేపథ్యంలో మహిళాసత్తా నాయకురాలు నిర్మలబోస్, దుకాణదారు లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆగ్రహించిన లోక్‌సత్తా ప్రతినిధులు మాచర్ల గుంటూరు ప్రధాన రహదారి పక్కనే బైఠాయించారు. దౌర్జన్యానికి దిగిన వారిపై కేసులు నమోదు చేయాలని నినాదాలు చేశారు. ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో సీఐ కొండారెడ్డి, ఎస్సైలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రెహమాన్ చేరుకున్నారు. ఇరుపక్షాలతో సీఐ చర్చించారు. తీవ్ర తర్జనభర్జనల అనంతరం లోక్‌సత్తా కార్యకర్తలు నిరసన విరమించారు. అంతకు ముందు భీమవరంలో జరిపిన యాత్ర కూడా ఉద్రిక్తతకు దారితీసింది. గొలుసు దుకాణాల వద్ద ఖాళీ సీసాలు లభ్యమయ్యాయి. పిదప గ్రామ మద్యం నియంత్రణ కమిటీని ఏర్పాటు చేశారు. ఇక్కడ అత్యంత నాటకీయ పరిణామాలు జరిగాయి. కాంగ్రెస్, తెదేపాల మధ్య ఆధిపత్యపోరు బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో సర్పంచి ఒంటిపులి మల్లేశ్వరిపై ఎస్సీలు ఫిర్యాదు చేశారు. ఈ యాత్రల్లో లోక్‌సత్తా నేతలు శ్రీనివాసరావు, నారాయణ రెడ్డి, శివనాగేశ్వరరావు, మనోరమ, లలితకుమారి, సరోజిని దేవి, రత్నం, ఎ.ఆర్.కె. చౌదరి, కె.వి. సాంబశివరావు, సాంస్కృతిక విభాగం సభ్యులు ఉన్నారు.

## మద్యంతో మహిళల పుస్తెలు తెగుతున్నాయి

**నరసరావు పేట పట్టణం :** రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు ప్రభుత్వం అనధికార అనుమతులు ఇవ్వటంతో వేలాది మంది మహిళల పుస్తెలు తెగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర మహిళా నేత మనోరమ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం నియంత్రణ చైతన్య యాత్ర జూలై 9న నరసరావు పేట చేరుకుంది. సత్తెనపల్లి రోడ్డులోని అమ్మవారి ఆలయం వద్ద మద్యం నియంత్రణ చైతన్య యాత్ర రథంపై నుంచి మనోరమ మాట్లాడారు. ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతోందని, నియంత్రించాల్సిన ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బెల్టుషాపులు ఏర్పాటు చేయడంతో పేద, మధ్య తరగతి వారు మద్యానికి బానిసలవుతున్నారన్నారు. మహిళా సత్తా జిల్లా అధ్యక్షురాలు లలితకుమారి మాట్లాడుతూ జిల్లాలో మద్యానికి వ్యతిరేకంగా విస్తృత పోరాటం సాగిస్తామన్నారు. అనంతరం పట్టణ అధ్యక్షులు ఈదర గోపిచంద్ రచించిన 'నైతిక విప్లవం' అనే పుస్తకాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. పార్టీ నాయకులు ఎ.ఆర్.కె.చౌదరి, టి. రాజశేఖర్, నిర్మలాదేవి, ఎం.వి. ఆంజనేయులు, దాసరి రత్నం, ప్రసన్నకుమార్, ఆళ్ల సుబ్బారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లా




## 'సర్కారు తీరుతో పేదల బతుకులు గుల్ల'

**విజయవాడ అర్బన్ జిల్లా :** రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మించి పేదల జవితాలను నాశనం చేయడమే రోశయ్య ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కఠారి శ్రీనివాస రావు ఆరోపించారు. బెంజిసర్కిల్ సమీపంలోని వేదిక ఫంక్షన్ హాలులో జూలై 10న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం అమ్మకాలను ఇబ్బడిముబ్బడిగా పెంచి ఖజానాను నింపుకోవాలనే దురాలోచనతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెప్పారు. బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నా పట్టించుకోకుండా ఎక్సైజ్‌శాఖ లంచాలకు అలవాటుపడి నిద్రమత్తులో తూగుతోందన్నారు. రోజువారి కూలి చేసుకుని సంపాదించే సామాన్యుడు సగటున రోజుకు మద్యానికి వందరూపాయలు ఖర్చు చేస్తున్నాడన్నారు. రాష్ట్ర ప్రజలు సంవత్సరానికి 40 వేల కోట్ల రూపాయలు మద్యానికి ఖర్చు చేస్తున్నారని, అందుకు రెట్టింపుగా ఆస్పత్రి ఖర్చులు పెరిగాయన్నారు. ఈ ఏడాది టీడీపీ, పీఆర్పీ నాయకులు పెద్ద ఎత్తున టెండర్లు వేసి మద్యం దుకాణాలు పాడుకుని నోటికి తాళం వేసుకున్నారన్నారు. మద్యం అమ్మకాలు నిలుపుదల చేయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మాలని ప్రతిపక్షనాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీ రామారావు ప్రభుత్వ హయాంలో ఉన్న 60 లక్షల తెల్లరేషన్ కార్డులు వైఎస్ హయాంలో రూ. రెండు కోట్లకు చేరాయని, మరింత మందికి రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కల్తీ మద్యం తాగి వరంగల్ జిల్లాలో 160 మందికి పైగా ప్రాణాలు పోగొట్టుకున్నారని శ్రీనివాసరావు చెప్పారు. మద్యం అమ్మకాలు, బెల్ట్‌షాపులపై లోక్‌సత్తా ఆధ్వర్యంలో నెల రోజులుగా అనేక ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే లూజు విక్రయాలు, బెల్ట్‌సాపులపై దాడులు చేసి నిర్వాహకులను పోలీసులకు అప్పగించి కేసులు నమోదు చేయిస్తున్నామన్నారు. మద్యంపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు మనోరమ, రత్నం, చెన్నుపాటి వజీర్, నగర నాయకులు డాక్టర్ పట్టాభి రామారావు, చుందూరి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మద్యం బారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుదాం...

**బెంజిసర్కిల్ :** మద్యం దుకాణాలకు టెండర్లు ముగిసేంత వరకు ప్రతి పక్ష పార్టీలు నోటికి తాళాలు వేసుకొని, టెండర్లు ముగిసిన తర్వాత రెండు రోజుల పాటు హడావుడి చేశాయని ఎద్దేవా చేశారు.

## మద్య నియంత్రణ జరిగే వరకు పోరాడతాం :

**బెంజిసర్కిల్ :** పేద కుటుంబాలు కూలిపోతున్నా పట్టించుకోకుండా మద్యంను విచ్చలవిడి చేసిందని విమర్శించారు. ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షాలు దీని గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఎందుకంటే మద్యం షాపుల్లో 50 శాతం అధికార పార్టీ, 30 శాతం తెలుగుదేశం పార్టీ, 10 శాతం ప్రజారాజ్యం పార్టీలకు చెందిన నేతలే పాడుకున్నారని తెలిపారు. మద్య నియంత్రణకు లోక్‌సత్తా నడుంకట్టిందని చెప్పారు.



## మద్యం షాపులపై లోక్‌సత్తా కొరడా

**విజయవాడ సిటి :** బార్‌షాపులలో నిబంధనలను అతిక్రమించి మద్యం విక్రయాలు చేస్తున్న షాపులపై లోక్‌సత్తా నాయకులు కొరడా ఝుళిపించారు. వాహనాలు, బైక్‌లపై నాయకులు, కార్యకర్తలు సూర్యారావుపేటలోని పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి పుష్పహోటల్ సెంటర్‌లో వున్న భవానీ వైన్ షాపులో తనిఖీలు చేశారు. లేబుల్స్ లేని మద్యాన్ని లూజ్‌గా విక్రయించడం, లైసెన్సును డిస్‌ప్లే చేయకపోవడం, బార్ ఆవరణలోనే సిట్టింగ్ రూం పెట్టి మద్యం ప్రియులను కూర్చోబెట్టడాన్ని అడ్డుకున్నారు. షాపు గుమస్తా సాంబశివరావుతో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సూర్యారావుపేట పోలీసులకు అప్పగించారు. అనంతరం లోక్‌సత్తా నాయకులు పట్టాభిరామయ్య, చెన్నుపాటి వజీర్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పట్టాభిరామయ్య, దాసరి రత్నం, చెన్నుపాటి వజీర్, ఎన్.సరోజాదేవి, రాజారమకృష్ణ వర్మ, మనోరమ, సిహెచ్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా



బెల్ట్ దుకాణాలపై పోరుబాట

◆ మద్యం నియంత్రణ చైతన్య యాత్రలో లోక్‌సత్తా

**కొంగారెడ్డి పల్లి:** స్వర్ణాంధ్రప్రదేశ్ స్థానంలో నేడు మాద్యాంధ్రప్రదేశ్‌గా తయారైందని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి విజయేందర్ రెడ్డి ఆరోపించారు. జూలై 11న పార్టీ నాయకులు చిత్తూరులో మద్యనియంత్రణ చైతన్య యాత్ర చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదాయాన్ని ఆశిస్తూ పేదల జీవితాలను ప్రభుత్వం మద్యం పాల్జేస్తున్నది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనోరమ మాట్లాడుతూ గ్రామల్లో మద్యం విక్రయాలు పెరిగిపోతుండడంతో ప్రతి ఇంట్లోనూ మహిళలు కంట తడి పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులందరూ కలసి శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న మద్యం దుకాణానికి వెళ్లారు. వారిన గమనించిన మద్యం ప్రియులందరూ అక్కడి నుంచి పరుగులు తీశారు. అనంతరం సి.బి.రోడ్డులోని ఎస్.కె.కళ్యాణమండపం ముందు ఉన్న బెల్ట్ దుకాణంలో మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కొందరిని సివిల్ అరెస్టు చేసి పోలీసులకు అప్పగించారు. ఆపై కోడిగుంటలో మద్యం తాగేవారు తక్కువగా ఉన్నారని, ఆ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోజాదేవి, దానరిరత్నం, జయకుమార్ పాల్గొన్నారు.

# కడప జిల్లా

## విడి మద్యం విక్రయాలపై లోక్‌సత్తా పోరు

**కడప :** మద్యం నియంత్రణ చైతన్యయాత్రలో భాగంగా జూలై 12న పార్టీ ఆధ్వర్యంలో కడపలో విడి మద్యం విక్రయాల దుకాణాలు, బెల్టుషాపులపై దాడులు చేశారు. కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసులొచ్చి పరిస్థితిని అదుపు చేశారు. లోక్‌సత్తా పార్టీ దాడులతో మందుబాబులు పరుగులు తీశారు. మద్య నియంత్రణ చైతన్యయాత్రలో భాగంగా రాష్ట్ర పార్టీ నాయకులు కడపలో హరిత హోటల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల



వేశారు. మద్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జానపద గేయాలు ఆలపించారు. అనంతరం సమీపంలో ఉన్న మోహన్ వైన్స్ వద్దకు వెళ్లారు. ఇకపై విడిగా మద్యం విక్రయించరాదని హెచ్చరించారు. మోహన్ వైన్స్ పక్కనే గదిని వేసుకొని లోపల మద్యం తాగుతున్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు వస్తున్నారని తెలుసుకుని తలుపులు వేసుకొని లోపల మద్యం తాగుతున్నారు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు తలుపులూ తెరిచి లోపలికి వెళ్లారు. మద్యం తాగుతున్న వారిని పట్టుకోబోయారు. వారంతా పరారయ్యారు. తరువాత దుకాణం షెట్టర్ మూయించారు.

### వాగ్వాదం

ఇంతలో దుకాణదారులు వచ్చి లోక్‌సత్తా పార్టీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. కోట్ల రూపాయలు డబ్బులు వెచ్చించి దుకాణాలు కొన్నాం. అమ్ముకోవడానికే తప్ప మూసుకోవడానికి కాదంటూ ఘర్షణకు దిగారు. కొద్దిసేపు వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో చిన్న చౌక్ ఏఎస్పై కృష్ణయ్య వచ్చి పరిస్థితిని అదుపు చేశారు.

### పోరాటం చేస్తాం..

రాష్ట్రవ్యాప్తంగా మద్య నియంత్రణపై పోరాటం చేస్తామంటూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు యస్. మనోరమ, ఎన్. సరోజాదేవి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆదాయం వైపే దృష్టి సారించిందే తప్ప ప్రజల ఆరోగ్యం గురించి ఆలోచించలేదన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రత్నం, ఆంజనేయులు, వేణుగోపాల్, తిరుపతమ్మ, విజయమ్మ, విజయకుమారి, జ్యోతిరాణి, లలితకుమారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా

## ప్రభుత్వం ప్రజలను తాగుబోతులు చేస్తోంది : లోక్‌సత్తా

**అనంతపురం :** ప్రభుత్వం ప్రజలను తాగుబోతులు చేస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనోరమ మండిపడ్డారు. నగరంలో గుక్కెడు మంచినీళ్లు దొరకని ప్రాంతాలు ఎన్నో




ఉన్నాయని, మద్యం లభించని చోటేలేదని అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో జూలై13న బెల్టుషాపులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో స్థానిక ఐఎంఏ హాలు నుంచి ర్యాలీ ప్రారంభమై సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా కొనసాగింది. సప్తగిరి సర్కిల్‌లోని చర్చి వద్దనున్న మద్యం దుకాణం ముందు నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. మహిళా సత్తా నాయకురాళ్లు దుకాణంలోకి వెళ్లి మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనోరమ మాట్లాడారు. ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థలకు అతి దగ్గరగా మద్యం షాపులన ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. ఇక్కడ షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్ర మహిళా సత్తా అధ్యక్షురాలు సరోజాదేవి మట్లాడుతూ ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని పేద కుటుంబాలను రోడ్డున పడేస్తోందన్నారు. మద్యం దుకాణాలు, బెల్టుషాపులు పెరిగిపోవడంతో పేద మహిళల బతుకులు దినదిన గండంగా గడుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడం దారుణమని రాష్ట్ర యువసత్తా అధ్యక్షులు రత్నం అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు సరస్వతి, అనంతపురం నియోజకవర్గ ఇన్‌చార్జీ డాక్టర్ కొండయ్య, రాష్ట్ర నాయకురాలు లలితకుమారి, జిల్లా నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై లోక్‌సత్తా నిరసన గళం

**అనంతపురం :** జిల్లాలో మద్యం షాపులతో పాటు పుట్టుకొస్తున్న బెల్టుషాపులపై లోక్‌సత్తా పార్టీ నాయకులు నిరసన తెలిపారు. జూలై13న నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ హాలు నుంచి బయలుదేరిన ర్యాలీ జిల్లా పరిషత్తు కార్యాలయం ఎదుటనున్న అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు మీదుగా టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు.



సుభాష్‌రోడ్డులోని పల్లవి వైన్స్, పక్కనే ఉన్న బెల్టుషాపులను మూసేయించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు విజయేందర్‌రెడ్డి, దాసరి రత్నం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనాథ్, వన్నూరప్ప, జిల్లా ఇన్‌ఛార్జి కొండన్న, మహిళాసత్తా రాష్ట్ర నాయకురాలు సరోజా దేవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, సత్తెమ్మలు మాట్లాడారు.



## మద్యపాన నియంత్రణకు చర్యలు తీసుకోండి : లోక్‌సత్తా

### మద్యంషాపు మూసివేత

**అనంతపురం :** మద్యపాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జూలై 13న మద్యపాన నియంత్రణపై స్థానిక ఐఎంఏ హాల్ నుంచి సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా ప్రధాన కూడళ్లల్లో చైతన్య ర్యాలీ నిర్వహించారు. అనంతపురం కేఎస్ఆర్ కళాశాలకు ఎదురుగా ఉన్న వైన్ షాపు ఎదుట ధర్నా నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును మూసివేశారు. అటు నుంచి నేరుగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్, కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర నాయకులు విజయేందర్‌రెడ్డి మాట్లాడారు. నిబంధనల మేరకు దేవాలయాలు, పాఠశాలలకు 100 మీటర్ల దూరంలోపు ఎటువంటి మద్యం షాపు ఏర్పాటు చేయకూడదన్నారు. కేఎస్ఆర్ కాలేజికి ఎదురుగానే మద్యం షాపును ఏర్పాటు చేయడం దారుణమన్నారు. వెంటనే అలాంటి షాపులను బంద్ చేయించాలని డిమాండ్ చేశారు. 10 రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఈఎస్ సత్యప్రాద్ హామీ ఇచ్చారు.

## మద్యం మాఫియాపై కలెక్టర్ సీరియస్
## సమీక్షించిన డిప్యూటి కమిషనర్

**అనంతపురం :** జిల్లా వ్యాప్తంగా మద్యం మాఫియా ఆగడాలను జిల్లా కలెక్టర్ జనార్ధన్ రెడ్డి తీవ్రంగా పరిగణించినట్లు స్పష్టమవుతోంది. మాఫియా ఆగడాలపై 'దోపిడికి లేచిన తెర' శీర్షికను ప్రచురితమైన కథనంపై స్పందించిన కలెక్టర్ ఎక్సైజ్ అధికారుల వివరణ కోరినట్లు సమాచారం. ముఖ్య అధికారులను తన ఛాంబరుకు పిలిపించుకుని మాట్లాడినట్లు తెలుస్తోంది. అసలే కరవు జిల్లా. ఏమిటీ విచ్చలవిడి విక్రయాలు, అధికధరలు. రూ॥కోట్లు కొల్లగొట్టే ప్రమాదముంది. అదే జరిగితే సాధారణ ప్రజలు ఏం కావాలి. మద్యం విక్రయాల్లో జరుగుతోన్న తంతు అధికారయంత్రాంగానికి అప్రతిష్ఠ తెస్తున్నాయి. వెంటనే పరిస్థితి అదుపులోకి రావాలి. అని ఆదేశించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో జూలై 13 సాయంత్రం ఎక్సైజ్ అధికారుల ఆఘమేఘాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఎస్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆల్వాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సూపరింటెండెంట్ సత్యప్రసాద్, ఏఈఎస్‌లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు. అయితే సమావేశంలో చెప్పుకోదగిన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. పై స్థాయిలో ఒత్తిడి ఎదురవుతున్న దృష్ట్యా భవిష్యత్తు కార్యచరణపై చర్చించినట్లు తెలుస్తోంది. మద్యం విచ్చలవిడి విక్రయాలపై ప్రజాసంఘాలు, ప్రజలనుంచి వస్తోన్న వ్యతిరేకతపైనా చర్చ జరిగినట్లు సమాచారం.
వెల్లువెత్తుతున్న నిరసన : ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయించడాన్ని అన్ని వర్గాలు నిరసిస్తున్నాయి. లోక్‌సత్తా ప్రత్యక్ష ఆందోళనకు పూనుకోగా మరికొందరు వ్యక్తిగతంగా ఫిర్యాదుచేస్తున్నారు.

## బెల్టుషాపులను నిర్మూలించాలి : లోక్‌సత్తా

**శింగనమల :** జూలై 13న శింగనమల మండలంలోని పలు గ్రామాలలో చైతన్య యాత్రలు నిర్వహించారు. శింగనమల అంబేద్కర్ విగ్రహానికి నివాళుల అర్పించారు. బెల్టుషాపుల వల్ల ఎన్నో కుటుబాలు నాశనం అవుతున్నాయన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టుషాపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యానికి ముప్పు తీసుకు వస్తూ వేలాది రూపాయలు లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కె.నాగేంద్ర, జిల్లా నాయకులు శ్రీనాథ్, వన్నూరప్ప, మండల నాయకులు నారాయణస్వామి, షబ్బీర్, ఓంకార్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు

డా॥ జేపీ సమాధానాలు ఇస్తారు. ప్రచురింపబడిన

ప్రతి ప్రశ్నకు రూ॥ 100/- పారితోషికం ఇవ్వబడును


# కర్నూలు జిల్లా



## 'బెల్టు' తీస్తాం!

◆ **నగరంలో మద్యం నియంత్రణ చైతన్యయాత్ర**

**కర్నూలు (ఎన్టీఆర్‌సర్కిల్) :** మద్యంపై ప్రజలను చైతన్య వంతులు చేయడానికి లోక్‌సత్తా పార్టీ నడుంబిగించింది. పార్టీ చేపట్టిన మద్య నియంత్రణ చైతన్య యాత్ర జూలై 14న నగరంలోకి ప్రవేశించింది. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు యాత్ర సాగింది. ఈ సందర్భంగా మహిళా సత్తా రాష్ట్ర అధ్యక్షురాలు సరోజాదేవి మాట్లాడుతూ ఆదాయాన్ని పెంచుకోవడానికి మద్యాన్ని ఏరులై పారించడం సిగ్గుచేటన్నారు. బస్తీలలో బెల్ట్‌షాపులను మూయించడమే మహిళా సత్తా లక్ష్యమని పేర్కొన్నారు. మద్య నియంత్రణ చైతన్య యాత్ర ఇన్‌చార్జీ విజయేందర్ రెడ్డి, కార్యదర్శి ఓంకార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అప్పగించి ఎఫ్ఐఆర్‌ను ఆమోదించినట్టు చేయడమే ఈ యాత్ర ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు రత్నం, జిల్లా అధ్యక్షుడు నరసింహా, నాయకులు మల్లికార్జున, సూర్యనారాయణ, పద్మ, బి.అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళాజాతా :**
కలెక్టరేట్ ఎదుట మద్య నియంత్రణ చైతన్య కమిటీ సభ్యులు చేపట్టిన కళాజాతా నాటకం ఆకట్టుకుంది. మద్యం వల్ల కలిగే నష్టాలు, మహిళల ఇబ్బందులు, పిల్లల అగచాట్లను కళ్ళకు కట్టినట్టు నృత్య రూపంలో కళాకారులు చూపించారు.

## మద్యంపై లోక్‌సత్తా సమరం

**కర్నూలు (జిల్లాపరిషత్తు) :** మద్యం నియంత్రణ కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా స్థానిక జిల్లాపరిషత్తు ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజవిహార్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కళాజాత బృందం సభ్యులు కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. మద్యానికి బానిసై కుటుంబాన్ని చిన్నాభిన్నం




చేసుకునే పేద, మధ్యతరగతి కుటుంబీకుల కథనాలను ప్రదర్శించారు. ప్రదర్శన ఆకట్టుకుంది.

మహిళలను చైతన్య పరుస్తాం : మద్యపాన నియంత్రణ ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను చైతన్యపరుస్తామని మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.సరోజాదేవి తెలిపారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ప్రభుత్వం తమ ఖజానాను నింపుకొనేందుకు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తోందని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను తాగుబోతులుగా మార్చి వారిని రోడ్డున పడేసేందుకే ప్రభుత్వం మద్యాన్ని ఏరులై ప్రవహింప చేస్తోందన్నారు. శ్రమజీవులు మద్యానికి బానిసలై కటుంబాలను వీధినపడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో మద్యనియంత్రణ చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి విజయేందర్‌రెడ్డి, మహిళా జిల్లా సత్తా నాయకురాలు పద్మ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ ప్రజల బాగోగులు విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జీ ఓంకార్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు నరసింహ, కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సత్తా జిల్లా అధ్యక్షుడు రాజ్యలక్ష్మీ, యువసత్తా అధ్యక్షుడు రత్నం, జిల్లా ఇన్‌ఛార్జి శ్రీధర్ పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లా



## పదిరూపాయలిచ్చి వందలాక్కుంటూన్నారు

◆ లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బాలాజీ

**వనపర్తి రూరల్ :** ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల పేరిట రూ॥10లు ఖర్చుపెట్టి మద్యం వ్యాపారం ద్వారా ప్రజలనుండి వందరూపాయలు రాబట్టకుంటున్నారని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బాలాజీ అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో చేపట్టిన మద్య నియంత్రణ చైతన్య యాత్ర వనపర్తి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోశయ్య ప్రభుత్వం ఆదాయం రాబట్టడానికి ప్రజల సంక్షేమం మరచి మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. తాగు నీరు లభించని గ్రామాలెన్నో ఉన్నాయని, కాని మద్యం దొరకని గ్రామాలు ఒక్కటి కూడా లేవన్నారు. ధనార్జన ధ్యేయంగా బావించిన ప్రభుత్వం బెల్టుషాపులను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో 70 లక్షల కుటుంబాలు మద్యం వ్యసనంతో చిన్నా భిన్నమయ్యాయన్నారు. మద్యం వ్యసనం నుండి ప్రజలను రక్షించడానికి లోక్‌సత్తా నడుం బిగించింది. ముందుగా బెల్టుషాపులను తొలగించే కార్యక్రమం ద్వారా ప్రజల్లో చేతన్యం తీసుకువస్తామన్నారు. అక్రమ సిట్టింగులు, బెల్టుషాపులు నిర్వహించిన వారిపై సీఆర్‌పీసీ, 43సీ సెక్షన్ ప్రకారం ప్రజలే నేరుగా వారిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించవచ్చున్నారు. సమావేశంలో రాష్ట్ర యువసత్త అధ్యక్షుడు దాసరి రత్నం, మహిళాసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మీ, రిజనల్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు బరత్‌కుమార్‌రెడ్డి, మహేష్, రామచంద్రుడు, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### బెల్టుషాపులపై దాడి

అంతకుముందు మండల పరిధిలోని రాజనగరం గ్రామంలోని బెల్టుషాపులపై లోక్‌సత్తా కార్యకర్తలు దాడిచేసి అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని వెలికితీశారు. షాపు నిర్వాహకులతో ఇకముందు మద్యాన్ని విక్రయించమని వారితో ప్రమాణం చేయించారు. పట్టణ సమీపంలోని బాలాజీ దాబాలో నిల్వ ఉన్న మద్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఆనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

### మద్యం నియంత్రణపై చైతన్య యాత్ర

**వనపర్తి :** పీఆర్ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని, రాష్ట్రంలో మంచినీళ్లు దొరకని ప్రాంతాలు ఉన్నాయి కానీ మద్యం దొరకని గ్రామాలు లేవన్నారు. గ్రామాలలో మహిళా సంఘాలు, పొదుపు సంఘాలు ఏకమై బెల్టుషాపుల మూసివేతకు, లైసెన్సు షాపులలో సిట్టింగ్ రూమ్‌ల తొలగింపుకు, నాటుసారా, గుడుంబా బట్టీల తొలగింపుకు కొంగు బిగించి ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. పట్టణాలలో, నగరాలలో, మండలాల్లో ఒక లైసెన్సు బ్రాందీ షాపు ఉంటే దాని చుట్టూ పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఇప్పుడు రాష్ట్రంలో ఒక లక్షకు పైగా బెల్టుషాపులు వెలిశాయన్నారు. ఇవి అక్రమ షాపులు, లైసెన్సు లేని షాపుల్లో మద్యం విక్రయించడం నేరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ, జలయజ్ఞం, మద్యంషాపుల పేరుతో ప్రజలను

దోచుకుంటుంది కానీ ప్రజల సంక్షేమం ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ప్రజాక్షేమం కోరాలంటే యువతకు ఉపాధి పథకం చేపట్టాలన్నారు. మద్యం షాపుల డబ్బులతో ముఖ్యమంత్రి రోషయ్య చెవులు, నోటికి తాళం వేసుకొని, చేతులు, కళ్ళకు పని పెట్టుకొన్నాడని వారు విమర్శించారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



**బెల్టుషాపులపై లోక్‌సత్తా దండయాత్ర**

**వనపర్తి రూరల్ :** ఆదాయం కోసం ప్రభుత్వం విచ్చల విడిగా మద్యం అమ్మకాలకు అనుమతులిస్తూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బాలాజీ, యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు రత్నం, మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.సరోజాదేవి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెల్లో అనదికారికంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులను నిరసిస్తూ జూలై 15న యాత్ర వనపర్తికి వచ్చింది. మండలంలోని రాజనగరం, మరికుంటల్లో రథ యాత్రను తీసుకువెళ్లి లోక్‌సత్తా నాయకులు బెల్టుషాపుల్లోని మద్యాన్ని పట్టుకున్నారు. ఇకపై ఇలాంటి అక్రమ మద్యం విక్రయాలు చేయకూడదని ఆయా బెల్టుషాపుల యజమానులతో లోక్‌సత్తా నాయకులు ప్రతిజ్ఞచేయించారు. ప్రతి పల్లెకు ప్రభుత్వం ప్రజారోగ్యం, పాఠశాలలు, తదితర సౌకర్యాల కల్పన కల్పించక పోయినా ప్రతి పల్లెకు మద్యం మాత్రం సరఫరావుతుందని వారు విమర్శించారు. మద్యం విక్రయాలే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిందని అందుకే ప్రభుత్వం కోట్లకు కోట్లు రాబట్టుకుంటూ రాష్ట్రంలో మద్యంప్రియుల సంఖ్యను గణనీయంగా పెంచుతుందన్నారు. దీని వల్ల ప్రతి కుంటుంబంలో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం మార్చాలని లేకుంటే లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వనపర్తి లోక్‌సత్తా నాయకులు నరహరి, హేష్, దాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

**మద్యం నియంత్రణపై కళ్ళుండీ చూడలేని ప్రభుత్వం :** మద్య నియంత్రణపై కళ్ళుండీ చూడలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు ధ్వజమెత్తారు. మద్యనియంత్రణ చైతన్య యాత్ర వనపర్తి పట్టణానికి చేరుకున్న సందర్భంగా పీఆర్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ బాలాజీ, మహిళా సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు మహాలక్ష్మీ యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు దాసరి రత్నంలు మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీ ఎన్నో పర్యాయాలు మద్యనియంత్రణ ఉండాలంటూ ముఖ్యమంత్రి రోశయ్య దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని వారు విమర్శించారు. సంక్షేమ పథకాలు అమల పరుస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజలను మత్తులో ముంచి నిలువు దోపిడీ చేస్తుందన్నారు. విడతల వారీగా మద్యాన్ని నియంత్రణ చేయాలన్నారు.

**గొలుసు దుకాణాలపై లోక్‌సత్తా దాడి**

**వనపర్తి గ్రామీణం :** లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాజనగరంలోని గొలుసు దుకాణాలు, మర్రికుంటలోని బాలాజీ దాబాపై దాడిచేశారు. రాజనగరం గ్రామంలో ఆయా వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని గొలుసు దుకాణాల్లోకి వెళ్లిమద్యంసీసాలను బయటకు తీశారు. అమ్మే వ్యక్తులతో ఇకపై మద్యం విక్రయాలు చేయమని ప్రమాణం చేయించారు. అనంతరం మర్రికుంట బాలాజీ దాబాలో సుమారు 30 వేల విలువ మద్యం సీసాలను బయటకు తీశారు. మద్యం అమ్మవద్దని దాబా యజమానికి చెప్పారు. కళాకారులు మద్యం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మండల ఎస్సై గురవారెడ్డికి లోక్‌సత్తా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలాజీదాబా యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# నల్గొండ జిల్లా

**బెల్టు షాపులను పట్టించిన లోక్‌సత్తా మద్యనియంత్రణ చైతన్య యాత్ర**

- **పెద్దమొత్తంలో మద్యాన్ని పట్టుకొని పోలీస్‌లకు అప్పగింత**
- **బెల్ట్‌షాపులు, సిట్టింగ్ రూమ్‌లకు వ్యతిరేకంగా ప్రచారం**

లోక్‌సత్తా పార్టీ, మహిళా, యువసత్తాలు బెల్ట్‌షాపులను మూయిద్దాం...సిట్టింగ్ రూమ్‌లను తొలగిద్దామనే నినాదంతో చేపట్టిన 'మద్యనియంత్రణ చైతన్య యాత్ర' జూలై 16న సాయంత్రం కోదాడకు చేరుకొంది. యాత్రలో పాల్గొన్న రాష్ట్ర జిల్లా, స్థానిక నాయకులు కళాకారుల కళారూపాల మధ్య అక్రమంగా నడుస్తున్న బెల్ట్‌షాపులవద్దకు వెళ్ళి మద్యాన్ని వెలికితీసారు. కోదాడ పట్టణ శివారులోవున్న బెల్ట్‌షాపునుండి 69 బీర్లు, 17 విస్కీ సీసాలను స్వాధీనం చేసుకొని కోదాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. మండలంలోని తమ్మర గ్రామంలోని మూడు బెల్ట్‌షాపుల వద్ద



అక్రమంగా అమ్ముతున్న సుమారు 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని రూరల్ పోలీసులకు అప్పగించారు.

యాత్రలో పాల్గొన్న లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి పి. రవిమారుత్, యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు దాసరి రత్నం, జిల్లా అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, యువసత్తా రాష్ట్ర నాయకులు ఇమ్మడి రమేష్, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు మామిడి రామారావు, రూరల్ అధ్యక్షులు కొడాలి రమేష్, కోదాడ నియోజకవర్గ అధ్యక్షులు సాతులూరి గోవిందరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత్, మోహన్‌రావులు మాట్లాడుతూ మా ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు వద్దని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బెల్ట్‌షాపులన్ని అక్రమషాపులని, అక్కడ మద్యం అమ్మడం నేరమని, వాటిని తొలగించాలని ప్రజల సంతకాలతో ఎక్సైజ్, పోలీస్ శాఖలకు అందచేయాలని వారు సూచించారు. మహిళాసంఘాలు, పొదుపుసంఘాలు, యువకులు, విద్యార్థులు సంఘటితమైన బెల్ట్‌షాపులు, సిటింగ్‌రూమ్‌లు, నాటుసారా, గుడుంబా బట్టీలను తొలగించేందుకు పూనుకోవాలని వారు పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తద్వారా మద్యం రహిత సమాజ నిర్మాణంకు లోక్‌సత్తా మద్యనియంత్రణ చైతన్యయాత్రను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. మద్యం మహమ్మారికి అనేక సంసారాలు కూలిపోతున్న పరిస్థితిలో అక్రమ అమ్మకాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని, లోక్‌సత్తా ఉద్యమంకు సహకరించాలని వారు కోరారు.

# ఖమ్మం జిల్లా

## మద్యం దుకాణాలపై కన్నెర్ర

- దుకాణాలపై లోక్‌సత్తా దాడి
- ఖమ్మం చేరిన మద్యనియంత్రణయాత్ర

**గాంధీ చౌక్ :** లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర మద్య నియంత్రణ చైతన్య యాత్ర జూలై17న ఖమ్మం పట్టణం చేరింది. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ఉద్యమం జరుగుతోంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని అనేక మద్యం దుకాణాలపై దాడులు జరిపారు. సిట్టింగ్ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి మద్యం సీసాలను, తినుబండారాలను ధ్వంసం చేశారు. శ్రీనివాసనగర్, గాంధీచౌక్, డీఆర్‌డీఏ, ఇల్లెందు క్రాస్




రోడ్డు, శ్రీనివాసథియేటర్ ప్రాంతంలోని మద్యం దుకాణాలను ధ్వంసం చేశారు. మద్యం ప్రియులను అక్కడి నుంచి తరిమారు. సిట్టింగ్‌లు ఏర్పాటు చేయొద్దని యజమానులను హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించారు. మద్య నియంత్రణ చైతన్య రథంలో హైదరాబాద్‌కు చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు ఇక్కడకు వచ్చారు. ఈ రథంతో పాటు రెండు జీపులు, అయిదు కార్లలో జిల్లాకు చెందిన సుమారు 100 మంది పట్టణంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి మద్యం దుకాణాలపై దాడులు జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువసత్తా అధ్యక్షుడు దాసరి రత్నం, నాయకులు కుడికాల ఆంజనేయులు, రాజ్యలక్ష్మీ, రవిమారుత్, డాక్టర్ సామినేని రాఘవులు, చింతల లింగేశ్వరరావు, పుల్లారావు, భద్రునాయక్, రమేశ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. వీరి ఉద్యమానికి పీవైఎల్, పీవోడబ్ల్యూ సంఘీభావం ప్రకటించాయి. ఇక్కడి నుంచి బయలుదేరిన యాత్ర వైరా, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లింది.

## బెల్టుషాపులను తక్షణమే మూసివేయాలి

**జిల్లాలో** వైన్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ సామినేని రాఘవులు అన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో న్యూస్‌టుడేతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ల దగ్గర్లో ఉన్న వైన్‌షాపుల్లో కూడా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. పార్టీ చేపట్టిన మద్య నియంత్రణ చైతన్య యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. జీవితాలతో చెలగాటమాడే మద్యాన్ని నియంత్రించకుండా మద్యమే ఆదాయ మార్గంగా భావించి ప్రభుత్వం ఊరికి 20 బెల్టుషాపులు ఉండే విధంగా ప్రోత్సహిస్తోందని ఆయన విమర్శించారు.

## బెల్ట్‌షాపులను నిషేధించాలి

**ఖమ్మం వన్‌టౌన్ :** అనధికార బెల్టుషాపుల వల్ల యువకులు మద్యానికి బానిసలుగా మారుతున్నారని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రవి మారుత్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర

కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్య నియంత్రణ చైతన్య యాత్ర జూలై 17న ఖమ్మం పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బెల్ట్‌షాపులను నిషేదించాలని డిమాండ్ చేశారు. దేవాలయాలు, మసీదులు, చర్చీలు, పాఠశాలల ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా షాపులు నిర్వహిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు సంపాదిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు. ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తూ సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా అధికార ప్రతినిధి డాక్టర్ సామినేని రాఘవులు, కార్యదర్శి చింతల లింగేశ్వర రావు, యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు దాసరి రత్నం, ప్రధాన కార్యదర్శి కె. ఆంజనేయులు, మహిళా కార్యదర్శి రాజ్యలక్ష్మీ, నాయకులు పుల్లారావు, బద్రురమేష్, బాలస్వామి, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ.వి.పుల్లయ్య, జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, డివిజన్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు ఆవుల మంగతాయి, కార్యదర్శి సీ.హెచ్. శిరోమణి, టి.ఝాన్సీ పాల్గొన్నారు.

**మద్యం షాపులపై దాడి :**

పట్టణంలోని పలు మద్యం షాపులపై లోక్‌సత్తా పీవైఎల్, పీఓడబ్ల్యూ, యువసత్తా కార్యకర్తలు దాడులు జరిపారు. స్థానిక శ్రీనివాస్‌నగర్‌లోని సాయిసుధా వైన్స్, గాంధీ చౌక్, మార్కెట్ రోడ్‌లోని నరేష్ వైన్స్, డీఆర్‌డీఏ ప్రాంతంలోని న్యూబగ్గా వైన్స్, ఇల్లెందు క్రాస్ రోడ్‌లోని బగ్గా వైన్స్, శ్రీనివాస థియేటర్ ప్రాంతంలోని బీమా వైన్స్‌లపై దాడి చేసి, మద్యం సీసాలను ధ్వంసం చేశారు. మందు బాబులను తరిమి వేశారు. షాపు యాజమాన్యాలకు సిట్టింగ్‌లు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు.



**'లోక్‌సత్తా' మద్య నియంత్రణ చైతన్యయాత్ర**

**ఖమ్మం కల్చరల్ :** లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఖమ్మంలో మద్య నియంత్రణ చైతన్యయాత్ర నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన మద్య నియంత్రణ చైతన్య యాత్ర రథం ఖమ్మం చేరుకోవడంతో పట్టణంలో ప్రదర్శన జరిపారు. యాత్రకు మద్దతు ప్రకటిస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ సంఘాలు ఈ చైతన్యయాత్రలో పాల్గొన్నాయి.

యాత్రలో భాగంగా పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు చేశారు. అక్రమ సిట్టింగ్‌లున్న షాపులను ధ్వంసం చేశారు. మద్యంసీసాలు పగులగొట్టారు. శ్రీనివాసనగర్, గాంధీచౌక్, మార్కెట్‌రోడ్, ఇల్లెందుక్రాస్‌రోడ్డులో వైన్స్‌షాపులపై దాడులు చేశారు. ఆ సమయంలో మద్యంతాగుతున్న వారిని బయటకు తరిమారు. ఈ క్రమంలో కొన్ని వైన్‌షాపుల వద్ద ఆందోళనకారులకు, యజమానులకు మధ్య తీవ్ర వాగ్వి వాదం జరిగింది.

అనంతరం అక్రమ సిట్టింగ్‌లు నిర్వహించే షాపులపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రవిమారుత్ మాట్లాడుతూ మద్యం దుకాణాల వల్ల పేదల జీవితాలు నాశనమవుతన్నాయన్నారు. లైసెన్స్‌ల షాపులే కాకుండా అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని ఇలాంటి వారిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, మసీదుల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తక్షణం మూసివేయాలని డిమాండ్‌చేశారు.

కార్యక్రమంలో నాయకులు సామినేని రాఘవులు, లింగేశ్వరరావు, రత్నం, ఆంజనేయులు, పుల్లారావు, పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు పుల్లయ్య, ఐలయ్య, మంగతాయి, ఝాన్సీ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా



**మద్యం నియంత్రణకు లోక్‌సత్తా పోరు**

**కాళ్ళ :** జిల్లాలో మద్యం నియంత్రణకు కృషిచేస్తున్నామని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానికిరామరాజు అన్నారు. కాళ్ళలో జూలై 18న మాట్లాడుతూ మద్యం దుకాణాల వద్ద బహిరంగాంగా సిట్టింగ్ ఏర్పాటుచేశారని, వీటికి అనుమతి లేదన్నారు. యువత పట్టపగలే మద్యం సేవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం నియంత్రణకు చైతన్య యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. కాళ్ళలో రెండు బెల్టుసాపులను

మూయించారు. ఆకివీడులో ఒక మద్యం దుకాణంపై కేసునమోదు చేయించామన్నారు. కాళ్ళ, సీసలి, పెదఅమిరం గ్రామాల్లో మద్యం దుకాణాలు, బెల్టుషాపులను మూయించివేశారు. షాపుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. సీతారామరాజు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర మండల ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

**ఆకివీడులో :** ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎంగిలి మెతుకులా చల్లి మద్యంపై వేలాదికోట్ల రూపాయలు దండుకుంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానకి రామరాజు విమర్శించారు. అధికారులు సైతం ప్రజల జీవితాలతో ఆట లాడుకుంటున్నారని అన్నారు. పార్టీ చేపట్టిన మద్యం నియంత్రణ ఉద్యమం చైతన్య యాత్రను పార్టీ పట్టణ కార్యాలయం వద్ద ప్రారంభించారు. కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పలు మద్యం బెల్టుషాపులు మూయించి వేశారు.



### మద్యపాన నియంత్రణ అవసరం

**భీమవరం టౌన్ :** ఆరోగ్య వంతమైన సమాజానికి మద్యపాన నియంత్రణ ఎంతో అవసరమని మహిళా సత్తా ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ అన్నారు. స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం మహమ్మారి బారినపడి పేదల జీవితాలు మగ్గిపోతున్నాయని అన్నారు. మద్యపాన నియంత్రణకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. లోక్‌సత్తా మహిళ అధ్యక్షురాలు లలితాదేవి మాట్లాడుతూ మద్యపాన నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు ముందుకు రావాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుకాదేవి మాట్లాడుతూ మద్యం కోసం భార్యలను వేధించడమే కాకుండా రేషన్ కార్డులను సైతం తాకట్టు పెడుతున్నట్లు తమ సర్వేలో వెల్లడయిందన్నారు. లోక్‌సత్తా జిల్లా నాయకులు గొట్టుముక్కల సీతారామరాజు, అల్లూరి సీతారామ రాజు మట్లాడారు. జవ్వాది సత్తిబాడు, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

### బెల్టుషాపు ఏర్పాటుపై మహిళల ప్రతిఘటన

**పాలకోడేరు :** గ్రామాల్లో మద్యం బెల్టుషాపుల ఏర్పాటుకు మహిళల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. తాజాగా పాలకోడేరు మండలం కుముదవల్లిలో కోనేరుగట్టున బెల్టుషాపు ఏర్పాటు యత్నాన్ని మహిళల వ్యతిరేకతతో యజమానులు విరమించుకున్న సంఘటన జరిగింది. ''మద్యం వల్ల సంసారాలు నాశనమవుతున్నాయి. జనావాసాల మధ్య మద్యం షాపుల వల్ల మహిళల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి" అని సుగుణమ్మ, వెంకటలక్ష్మీ, దుర్గ, కనకమహాలక్ష్మీ, మణెమ్మ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బెల్టుషాపును పెట్టనివ్వబోమని వారు హెచ్చరించారు.



### మద్య నియంత్రణకు లోక్‌సత్తా ఉద్యమం

**ప్రకాశంచౌక్(భీమవరం), ఆకివీడు :** మద్యం దుకాణాల వద్ద, గ్రామాల్లో అనధికారిక బెల్టుసాపులు ద్వారా మద్యం విక్రయ నియంత్రణకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానకిరామరాజు హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మద్య నియంత్రణ చైతన్య యాత్రలో భాగంగా భీమవరం పట్టణంలో పార్టీ కార్యాలయంలో జూలై18న విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర యువసత్తా అధ్యక్షుడు దాసరి రత్నం, అల్లూరి సీతారామరాజు, జవ్వాది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. తరువాత భీమవరం పట్టణంలో అనధికారికంగా ఏర్పాటుచేసిన పలు మద్యం దుకాణ యజమానులపై మహిళాసత్తా నాయకులుతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**భీమవరం :** ఆకివీడు సీపీఎం కార్యాలయం వీధిలోని ఓ బెల్టుషాపుపై లోక్‌సత్తా నాయకులు యుద్ధం ప్రకటించారు. దుకాణంలో ఉన్న మద్యం సీసాలను బయటకు తెచ్చి ఆందోళన చేశారు. పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనధికార విక్రయాలను అడ్డుకున్నారు.

## సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెల 10వ, 25వ తేదీల్లోగా పంపించండి. వీలు వెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాము. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

# తూర్పుగోదావరి జిల్లా




### కఠిన మద్య నియంత్రణ అమలు చేయాలి

**కోటగుమ్మం :** రాష్ట్రంలో కఠిన మద్యనియంత్రణ అమలుచేయాలని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.డి రామారావు డిమాండ్‌చేశారు. మద్య నియంత్రణ చైతన్య యాత్ర జూలై 19న ప్రవేశించిన సందర్భంగా రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో కృషిచేస్తేనే రాష్ట్రంలో మద్యం నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ద్వారా ఒక రూపాయి పంచి, మూడు రూపాయిలు పేద, మధ్యతరగతి ప్రజల నుంచి ప్రభుత్వం లాగేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో 5 వేల పైబడి ఉన్న మద్యం షాపులను వెయ్యికి పరిమితి చేసి పేద, మధ్యతరగతి వర్గాల ఆరోగ్య పరిపుష్టికి కృషిచేయాలన్నారు. ప్రభుత్వమే మద్యం షాపులను నియమ నిబంధనల మేరకు నిర్వహించి విచ్చలవిడిగా మద్యం వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. జాతీయ రహదారులపై మద్యం షాపులు నిర్వహించకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో చైతన్యయాత్రలు బృందం ద్వారా మిర్తిపాడు, జగ్గంపేట, బూరుగుపూడి గ్రామాల్లో ప్రజలు నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతిస్తున్నామన్నారు. అదే విధంగా పెద్దాపురం, కాకినాడ భానుగుడి కూడల్లిలో భారీ ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ చైతన్య యాత్రలో యువసత్తా, మహిళాసత్తా ఆధ్వర్యంలో స్థానిక యువకులు, డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ ప్రాంతీయ అధ్యక్షురాలు ఆర్.చంద్రకళ, నగర అధ్యక్షులు డాక్టర్ వి.వి.రామారావు, పి.సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరి, రవి తదితరులు పాల్గొన్నారు.

### బెల్ట్ షాపులను తొలగించాలి

◆ మద్యపాన వ్యతిరేక ఉద్యమాలకు లోక్‌సత్తా బాసట

**రాజమండ్రి క్రైం :** ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బెల్ట్ షాపులను తొలగించి ప్రజలను దురలవాటు నుంచి రక్షించాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. జూలై 19న రాజమండ్రి విచ్చేసిన లోక్‌సత్తా పార్టీ మద్య నియంత్రణ కమిటీ ప్రత్యేక బృందం జిల్లా పర్యటన వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించింది. రాష్ట్ర




ఉపాధ్యక్షుడు వైడి రామారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారానే అభివృద్ధి చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని 5464 ప్రభుత్వ మద్యం దుకాణాలకు 20నుంచి 50 రెట్లు బెల్ట్ షాపులు వెలిసాయని, దీని వల్ల 70 లక్షల కుటుంబాలు నాశనమవుతున్నాయని అన్నారు. ప్రజలు కూడా మద్యపానం వల్ల కలిగే అనర్థాలను గుర్తించి అవగాహనతో ఆ దురలవాటును మానుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రాంతీయ అధ్యక్షురాలు ఆర్.చంద్రకళ, అర్బన్ అధ్యక్షుడు వీవీ రామారావు, జిల్లా ఇన్‌చార్జి గుంటూరి రామరాజు, అర్బన్, రూరల్ ఇన్‌చార్జిలు రవి, భవానీ శంకర్ యాదవ్, పాలదాసి సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

**పర్యటన వివరాలు :** సమావేశం అనంతరం లోక్‌సత్తా పార్టీ సీతానగరం మండలం మిర్తిపాడు వెళ్లి అక్కడ గ్రామస్తులు మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ జరిపిన ఉద్యమానికి మద్దతు ప్రకటించింది. దీని తర్వాత జగ్గంపేట మండలం బూరుగుపూడిలో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ అమరణ దీక్ష చేసిన సర్పంచ్‌ను కలిసి, పెద్దాపురం పట్టణంలో మద్యపాన వ్యతిరేక ర్యాలీ, కాకినాడ భానుగుడి జంక్షన్‌లో మరో ర్యాలీ నిర్వహిస్తామని ప్రత్యేక బృందం తెలిపింది.

# విశాఖపట్నం జిల్లా

### ఉద్యమించిన మహిళలు

◆ అబ్కారీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

◆ బెల్టు దుకాణాలు మూయించాలని డిమాండ్

**విశాఖపట్నం అరిలోవ:** అరిలోవ ప్రాంతంలో మద్యం బెల్టు దుకాణాలపై రెండురోజుల పాటు దాడులు నిర్వహించిన మహిళలు జూలై 20 ఇసుకతోటలోని అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విశాఖ మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో సుమారు వెయ్యిమంది మహిళలు పాల్గొన్నారు. బెల్టు దుకాణాలను మూయించకపోవడానికి కారణమేమిటని



నిలదీశారు. అధికారులు కూడా మద్యం మత్తులో జోగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబ్కారీ శాఖ సూపరిండెండెంట్ హనుమంతరావు స్పందిస్తు తక్షణం బెల్టు దుకాణాలపై దాడులు చేస్తామని, ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో అవి లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో దుకాణాలు మూసివేయకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని మహిళలు పేర్కొన్నారు.

**కదిలిన అధికార గణం**

విశాఖ మహిళా సేవా సంఘం సభ్యులు 1, 2, 3 వార్డు పరిధిలో సుమారు పది దుకాణాలపై దాడులు చేసి సీసాలను పగులగొట్టిన విషయం తెలిసిందే. సమయపాలన పాటించని వైన్స్ షాపులకు మహిళలు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో అబ్కారీ శాఖ ఎట్టకేలకు దిగి వచ్చింది. బెల్టు దుకాణాలను మూయించేందుకు ఆదేశాలిచ్చినట్లు భోగట్టా, ఇక విశాలాక్షినగర్‌లో ఉన్న అబ్కారీ శాఖ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తు బెల్టు దుకాణాలపై దాడులు చేసారు. రానున్న రోజుల్లో కూడా దాడులు కొనసాగిస్తామని అబ్కారీ శాఖ సర్కిల్ -2 సి.ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.




**బెల్టుషాపుల ఏర్పాటును వ్యతిరేకించండి**

**అక్కిరెడ్డిపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కేవలం ఆదాయం కోసం మద్యం షాపులకు విచ్చలవిడిగా లైసెన్సులు ఇవ్వడం సిగ్గుచేటని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైడిరామారావు ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో భాగంగా జూలై 20న గాజువాకలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వై.డి.రామారావు మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులై మద్యపానానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.



**మద్యంపై మండిపాటు**

**◆ గాజువాకలో లోక్‌సత్తా నిరసన ర్యాలీ**

**విశాఖపట్నం, గాజువాక:** రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు అనుమతిచ్చి పేదల జీవితాలపై స్వారీ చేస్తోందంటూ లోక్‌సత్తా ధ్వజమెత్తింది. పార్టీ ఆధ్వర్యంలో జూలై 20న గాజువాకలో లిక్కర్ వ్యతిరేక ఉద్యమం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో పాతగాజువాక నుంచి నిరసన ప్రదర్శన కొత్తగాజువాక వరకూ కొనసాగింది. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.డి. రామారావు, రాష్ట్ర మహిళాసత్తా ఉపాధ్యక్షురాలు యస్. మనోరమ, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, జి. ఎ. బిహారీలాల్ నేతృత్వంలో మద్యం బెల్టుషాపులు తొలగించాలంటూ నినాదాలిచ్చారు. కొత్త గాజువాక, సినిమాహాలు కూడలి వద్ద బార్లు, మద్యం దుకాణాలు, బెల్టుషాపుల్లోకి వెళ్లి మద్యం సీసాలను పగులగొట్టారు. లూజ్ సేల్స్ ఆపాలని, బెల్టుదుకాణాలు మూసేయాలంటూ నిరసన తెలిపారు.

## విజయనగరం జిల్లా




**మద్యంపై లోక్‌సత్తా పోరు**

**మయూరికూడలి :** కొన్ని లక్షల పేదల బతుకులు మద్యం

బారినపడి చితికిపోతున్నా రోశయ్య ప్రభుత్వం మద్యం అమ్మకాలే ప్రధానంగా పాలన సాగిస్తున్నారని యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు దాసరి రత్నం ఆరోపించారు. మద్యం నియంత్రణ చైతన్య యాత్రలో భాగంగా జూలై 21న యువసత్తా బృందంతో విజయనగరం చేరుకున్న ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మంచినీళ్లు దొరకని ప్రాంతాలున్నాయని, పాఠశాలలు, ఆసుపత్రులు అందుబాటులో లేని బస్తీలున్నాయని, కానీ మద్యం దొరకని గ్రామం ఎక్కడా లేదన్నారు. పాలన సాగించడం చేతకాని ప్రభుత్వం మద్యం అమ్మకాలు పెంచి, బెల్టుషాపుల్ని విపరీతంగా పెంచి రూ॥20వేల కోట్ల వరకు మద్యం అమ్మకాలు సాగించాలనీ యోచిస్తోందని ఆ కుట్రను తరిమి కొట్టాలనే లోక్‌సత్తా మద్య నియంత్రణ చైతన్య యాత్ర ప్రారంభించిందన్నారు. ప్రజలు సహకరిస్తే బెల్టుషాపుల్ని పూర్తిగా తీసివేస్తామని పిలుపునిచ్చారు. యువసత్తా రాష్ట్ర కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ యాత్ర నిర్వహిస్తున్న ప్రతీ ప్రాంతంలో ప్రజలు, సర్పంచులు, మహిళా సంఘాలు, యువకులు మద్యం దుకాణాలు వద్దంటూ లోక్‌సత్తాకు మద్దతు పలుకుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, ఐ.అనంతలక్ష్మీ, ఎం.సుభద్రాదేవి, మనోరమ, రాయి పద్మావతి, డానియల్, పి.వి.రమణ, తిప్పాన కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




## బెల్టు దుకాణాలపై మహిళాసత్తా దాడి

బెల్టుషాపులు వద్దంటూ మహిళాసత్తా ధ్వజమెత్తింది. పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి సాలిపేట, పెద్దాసుపత్రి ప్రాంతం, జెడ్పీ కార్యాలయం వద్ద.. పలు ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. మద్యం సీసాలను పగులగొట్టారు. దుకాణదారులను హెచ్చరించారు. కార్యక్రమమంలో రాష్ట్ర మహిళాసత్తా అధ్యక్షురాలు మనోరమ, ఐ.అనంతలక్ష్మీ, ఎం.సుభద్రాదేవి. రాయి పద్మావతి, రూపవతి, సుధారాణి, భారతి, తాడెల వెంకట్రావు యాదవ్, దయానంద్‌శర్మ, శ్రీనివాసరాజు, భాస్కర్, ఎర్రిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 'బెల్టు'పై లోక్‌సత్తా దాడి

బెల్టుషాపులపై లోక్‌సత్తా పార్టీ యుద్ధం ప్రకటించింది. యువసత్తా, మహిళా సత్తాల సభ్యులు విజయనగరంలో ర్యాలీ జరిపి, బెల్టు షాపులను మూయించారు. తొమ్మిది దుకాణాలపై దాడిచేసి, మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఇకపై మద్యం అమ్మబోమని వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ లోక్‌సత్తా ప్రతినిధి చౌదరి, మనోరమ, మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




## బెల్టుషాపులపై లోక్‌సత్తా దాడి

**విజయనగరం టౌన్ :** విజయనగరం పట్టణంలో పలు బెల్టుషాపులపై లోక్‌సత్తా పార్టీ దాడి చేసింది. 9 షాపుల్లోని 20 మందు సీసాలను బయటకు తెచ్చి పగలగొట్టారు. యువసత్తా, మహిళాసత్తా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ బెల్టుషాపులను నిర్వహించకుండా అడ్డుకున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా మద్యం, మన బస్తీలో బెల్టుషాపులొద్దు అంటూ నినదించారు. ఈ ర్యాలీ స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభమైంది. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టిబాబ్జీ మాట్లాడుతూ పేదవాళ్లను, ప్రభుత్వం మద్యం పేరిట దోపిడీ చేస్తుందన్నారు. ఒక లైసెన్స్ బ్రాందీ షాపు చుట్టూ పదుల సంఖ్యలో బెల్టుషాపులు వెలుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి బెల్టుషాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యువసత్తా రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ సారా, గుడుంబా బట్టీలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు దాసరి వెంకటరత్నం మాట్లాడుతూ మహిళా సంఘాలు, పొదుపుసంఘాలు ఏకమై బెల్టుషాపులను మూసివేసే వరకు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ లోక్‌సత్తా ప్రతినిధి ఎ.ఆర్.కె. చౌదరి, మనోరమ, మహలక్ష్మి పాల్గొన్నారు.

ఉరకలెత్తే యువశక్తిని
లోక్‌సత్తా పిలుస్తోంది
రండి... అవినీతిని అరికడదాం

# శ్రీకాకుళం జిల్లా

## రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించాలి

**శ్రీకాకుళం, పాతశ్రీకాకుళం :** రాష్ట్రంలో సుమారు 75 లక్షల కుటుంబాలను నాశనం చేస్తున్న మద్యాన్ని ప్రభుత్వం నిషేధించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మద్యనియంత్రణ చైతన్య యాత్రలో భాగంగా స్థానిక డే అండ్ నైట్ కూడలి నుండి వై.ఎస్.ఆర్.సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మనోరమ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా రేట్లు పెంచి వేలం నిర్వహించడంతో మద్యం వ్యాపారులు వందల సంఖ్యలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ ప్రజలను మద్యానికి బానిసలుగా చేస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో చైతన్య యాత్ర చేపట్టామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపుల ఎత్తివేతకు ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీ చేపట్టిన ఉద్యమానికి ప్రజలు మద్దతివ్వాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఇతర ఆదాయ వనరులపై దృష్టి సారించకుండా కేవలం మద్యం పైనే దృష్టి పెట్టి అమ్మకాలకు లక్ష్యాలు నిర్ణయించడం రాష్ట్ర ప్రజల దురదృష్టమని అన్నారు. ప్రదర్శనలో పార్టీ రాష్ట్ర నాయకులు విమలాదేవి, విజయకుమారి, అనంతలక్ష్మీ, రాష్ట్ర యువసత్తా నాయకులు దాసరి రత్నం, కె. అంజనేయులు, జిల్లా పార్టీ నాయకులు కె. పోలినాయుడు, బి.జగదీష్, గురుగుబెల్లి అప్పలనాయుడు, జిల్లా యువసత్తా నాయకుడు పంచాది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాచైతన్యంతోనే మద్య నియంత్రణ

**ఏడురోడ్ల జంక్షన్ పొందూరు :** ఈ నెల 7న దుబగుంట నెల్లూరుజిల్లాలో ప్రారంభమైన చైతన్యర్యాలీ పట్టణానికి చేరుకుంది. డే అండ్ నైట్, ఏడురోడ్ల కూడలి. వార్డుల్లో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. మనోరమ మాట్లాడుతూ 15 జిల్లాలో చైతన్య యాత్ర ముగించి 16న శ్రీకాకుళంలో పర్యటించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పర్యటించిన ప్రాంతాలలో 300 అక్రమ బెల్ట్ మద్యం దుకాణాలు 14 సిట్టింగ్ షాపులను గుర్తించి ఆయా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మద్యం ధరల పెంపుదలకు నిరసనగా లోక్‌సత్తా ఆధ్వర్యంలో పొందూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీ ధరలు కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న మద్యం షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని మనోరమ డిమాండ్ చేశారు.

## మద్యం విక్రయాలపై లోక్‌సత్తా నిరసన

**పొందూరు :** రాష్ట్రంలో మంచినీళ్లకు, మౌలిక సదుపాయాలకు



ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం విస్తృతంగా మద్యం విక్రయించడంతో రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా పేరు పొందిందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ విమర్శించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్ముతున్న మద్యం విక్రయాలను నిర్మూలిద్దామని పార్టీ పిలుపునిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బెల్టుషాపులను మూయిద్దాం... సిట్టింగ్ షాపులను తొలగిద్దాం అంటూ నినదించారు. మండల కేంద్రంలో బ్రాందీషాపులు వద్ద విడిగా అమ్ముతున్న మద్యాన్ని పారబోశారు. షాపు యజమానులతో లోక్‌సత్తా పార్టీకి మద్దతు పలుకుతున్నామని ప్రమాణం చేయించారు.

## మద్యం బారి నుంచి బయటపడాలి

**ఏడురోడ్ల కూడలి:** రాష్ట్రాన్ని మద్యం భూతం నుంచి పరిరక్షించడానికి యువత, మహిళాలోకం నడుం బిగించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.మనోరమ పిలుపునిచ్చారు. మద్యం నియంత్రణ చైతన్య యాత్రలో భాగంగా బృందంతో శ్రీకాకుళం చేరుకున్న ఆమె పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా మద్యం' అంటూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఆరోపించారు.

**ఎచ్చెర్ల :** మద్యం గొలుసు దుకాణాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం జరపనున్నట్లు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మనోరమ చెప్పారు. రాష్ట్ర వ్యాప్త మద్యనియంత్రణ చైతన్య యాత్ర నిర్వహించారు. ముందే లోక్‌సత్తా బృందం వస్తుందని తెలుసుకున్న గ్రామంలోని మద్యం గొలుసు దుకాణం యజమానులు దుకాణాలన్ని మూసివేశారు. రూ.1.64 లక్షలకు మద్యం దుకాణం నడుస్తోందని గ్రామస్థులు లోక్‌సత్తా బృందానికి తెలిపారు. దీంతో గ్రామం మొత్తం డప్పులతో ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను పంచారు. ప్రజా సహకారంతో మద్యం నియంత్రణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# మద్య నియంత్రణ చైతన్య యాత్ర



మహబూబ్‌నగర్ జిల్లా




నల్గొండ జిల్లా



ఖమ్మం జిల్లా



పశ్చిమగోదావరి జిల్లా



తూర్పు గోదావరి జిల్లా



విశాఖపట్నం జిల్లా



విజయనగరం జిల్లా




శ్రీకాకుళం జిల్లా

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




From,

To,

**Book-Post**
PRINTED MATTER

**Lok Satta Times**
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad